జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | శనివారం 18 ఏప్రిల్ 2026 | సంపుటి : 16 | సంచిక : 264 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989894528

## ఏరోస్పేస్' వ్యూహాత్మక కేంద్రంగా
# తెలంగాణ




- రాష్ట్రాలే రాబోయే రోజుల్లో 'ఏరోస్పేస్' లో గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతాయి
- ఆ దిశగా... ఈ రంగంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సవాళ్లు, మార్పుల్ని అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో 'ఎకో సిస్టం'ను అభివృద్ధి చేస్తున్నాం
- 'ఏరోస్పేస్' అంటే కేవలం యంత్రాల తయారీ మాత్రమే కాదు
- ఇప్పుడున్న పరిస్థితుల్లో అది ఒక దేశ వ్యూహాత్మక శక్తికి, ఆత్మవిశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది

హైదరాబాద్

భవిష్యత్తు 'ఏరోస్పేస్' రంగ అవసరాలకు అనుగుణంగా 'తెలంగాణ'ను దేశానికి ఒక వ్యూహాత్మక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆర్అండ్ డీ, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్, సర్టిఫికేషన్ అండ్ కాంప్లియెన్స్.. ఈ మూడింటిని అనుసంధానించగలిగే దేశాలు, రాష్ట్రాలే రాబోయే రోజుల్లో 'ఏరోస్పేస్' లో గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతాయన్నారు. ఆ దిశగా... ఈ రంగంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సవాళ్లు, మార్పుల్ని అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో 'ఎకో సిస్టం'ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. శుక్రవారం 'ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా' హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో గచ్చిబౌలీలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో 'ఛేంజింగ్ సినారియో ఇన్ ఏ రోస్పేస్; ఆర్అండ్‌డీ, మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ సర్టిఫికేషన్' - మిగతా3లో



## ఉత్తరాది, దక్షిణాది భేదాలు చూపి
## దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదు

- 2029లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు అమలు చేసేలా ముందుకెళ్తున్నామన్న అమిత్ షా
- ఒక ఎంపీ లక్షల మంది ప్రజల సమస్యలను ఎలా వినగలరన్న హోం మంత్రి

## కాళేశ్వరం మరమ్మత్తులకు
# ప్రత్యేక కమిటీ

మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల రీహాబిలిటేషన్‌కు ప్రత్యేక కోఆర్డినేషన్ కమిటీ



హైదరాబాద్


తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరం మరమ్మత్తుకు సంబంధించిన పనులపై కల్నల్ పరీక్షిత్ మెహ్రా అధ్యక్షతన తొమ్మిది మంది సభ్యులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసింది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల రీహాబిలిటేషన్‌కు ప్రత్యేక కోఆర్డినేషన్ కమిటీ నియమించినట్లు పేర్కొంది. మే 30 నాటికి మరమ్మత్తుకు సంబంధించిన పరిశోధన పూర్తిచేయాలని ఆదేశించింది.



## డీలిమిటేషన్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి

- మోదీ సర్కార్‌కు విపక్షాలు డిమాండ్
- నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై భగ్గుమన్న ప్రతిపక్ష పార్టీలు
- ఆ బిల్లును విత్‌డ్రా చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న విపక్షాలు
- మోదీ సర్కార్‌పై కాంగ్రెస్, ఆర్‌జేడీ, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ ఫైర్

## అన్ని నౌకలకు అనుమతి



- గుడ్‌న్యూస్.. హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరిచిన ఇరాన్..
- ఇకపై అందరికీ అందుబాటులో హోర్ముజ్ జలసంధి
- ఇటీవలే అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం
- పది రోజులపాటు కాల్పుల విరమణ కొనసాగనుంది.



## వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు

- మిగిలిన రెండింటిని ఉపసంహరించుకున్న కేంద్రం
- లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ఓటింగ్
- బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు వ్యతిరేకంగా 230 ఓట్లు
- మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేకపోయిన ఎన్డీఏ

## వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో
# తెలంగాణ టాప్



- 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించండి
- కేంద్రానికి సీఎం విజ్ఞప్తి
- రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి
- 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్రానికి విజ్ఞప్తి
- రాష్ట్రానికి రావాల్సిన బకాయిల విడుదలకు వినతి

హైదరాబాద్

యాసంగి పంటకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించాలని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయిన రాష్ట్ర బృందం తెలంగాణకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని కోరింది. పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపాల నివారణకు గానూ ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరాను పాఠశాలలు, వసతిగృహాలకు పునరుద్ధరించాలని - మిగతా3లో



## రాజధాని పరిధిలో పురుషుల కంటే
# మహిళలే ఎక్కువ

- టాప్‌లో రంగారెడ్డి
- లింగ నిష్పత్తిలో రంగారెడ్డి జిల్లాదే అగ్రస్థానం
- మూడు జిల్లాల్లో మహిళల సంఖ్యే ఎక్కువ
- స్పష్టం చేసిన సామాజిక ఆర్థిక కుల సర్వే నివేదిక
- మేడ్చల్-మల్కాజిగిరిలో సగటు లింగ నిష్పత్తి 1066

హైదరాబాద్

తెలంగాణలో నగర, పట్టణ జనాభాలో లింగ నిష్పత్తి చాలా ముందంజలో ఉంది. గతేడాది తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ఆధారంగా తాజాగా విడుదలైన తెలంగాణ అర్బన్ డెమోగ్రాఫిక్ టేబుల్స్ (2024) గణాంకాల ప్రకారం రాజధాని పరిధిలోని జిల్లాల్లో పురుషుల కంటే మహిళల సంఖ్య ఎక్కువగా - మిగతా3లో



## మహిళా రిజర్వేషన్ల మాటున
# డీలిమిటేషన్

- మహిళాబిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే కుట్ర
- కేంద్రంపై రాహుల్ ధ్వజం
- అధికారాన్ని శాశ్వతం చేసుకునేందుకే మోదీ వ్యూహం : రాహుల్
- ఇంద్రజాలికుడు అడ్డంగా దొరికిపోయారు
- బీజేపీ తమకు లాభం చేకూర్చేలా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది

# మహిళా రిజర్వేషన్ల మాటున డీలిమిటేషన్



ప్రభుత్వం ఇప్పుడు పెట్టేది అసలు మహిళా బిల్లే కాదని, 2023లోనే అది ఆమోదం పొందిందని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. ఇప్పుడు కొత్తగా మహిళా బిల్లు పెట్టాల్సిన అవసరమే లేదని చెప్పారు. మహిళాబిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. పాత మహిళా బిల్లును రద్దుచేసి కొత్త బిల్లు తీసుకురావాలని కేంద్రానికి సవాల్ విసిరారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా మద్దతు ఇస్తుందని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లులపై శుక్రవారం మధ్యాహ్నం లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన కీలక కామెంట్స్ చేశారు. ఆ వ్యాఖ్యలు సభలో గందరగోళం సృష్టించాయి. కేవలం అధికారాన్ని శాశ్వతం చేసుకునేందుకే ప్రధాని మోదీ ఈ రాజకీయ వ్యూహాన్ని పన్నారని ఆయన విమర్శించారు. బీజేపీ తమకు లాభం చేకూర్చేలా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను మార్చుకోవడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఈ ప్రయత్నాన్ని 'గెర్రీమాండరింగ్'గా రాహుల్ అభివర్ణించారు. 2029 ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ ఈ కుట్రకు తెర తీసిందని, నియోజకవర్గాల పటాలను మార్చడం ద్వారా ప్రతిపక్షాల బలాన్ని తగ్గించాలని మోదీ చూస్తున్నారని రాహుల్ ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లే ఈ పార్లమెంటు సెషన్ అజెండా అయితే, తాము ఏమాత్రం సంకోచించకుండా ఈ క్షణంలోనే ఆ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. 2023లో పార్లమెంటు ఆమోదాన్ని పొందిన మహిళా రిజర్వేషన్ చట్టం అమలు విషయంలో కేంద్ర సర్కారుకు సహకరించేందుకు మేం రెడీ. కానీ ఇప్పుడు కేంద్ర సర్కారు తేవాలని చూస్తున్నది మహిళా కోటా బిల్లులా కనిపించడం లేదని రాహుల్ విమర్శించారు. దానితో డీలిమిటేషన్‌కు లింకులు పెడుతున్నారని మండిపడ్డారు. భారతదేశ జాతీయ ఆలోచనా విధానంలో మహిళలు ఒక చోదక శక్తి అని ఆయన అన్నారు. మనమంతా మహిళల జీవితాల ద్వారా ఎంతో ప్రభావితులం అయ్యామని, ఎన్నో విషయాలను నేర్చుకున్నామన్నారు.

కానీ కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్, జనాభా గణనలతో మహిళా కోటాకు ముడిపెట్టడం సరికాదన్నారు. మహిళా కోటా అమలుకు డీలిమిటేషన్‌తో అసలు సంబంధమే లేదని, దీన్ని వెంటనే అమల్లోకి తేవచ్చని రాహుల్ తెలిపారు. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలకు అన్యాయం చేసేలా నియోజకవర్గాల పునర్విభజన చేయడం అనేది దేశ వ్యతిరేక చర్య కంటే తక్కువేం కాదన్నారు. కులగణన డేటాను విస్మరించడం ద్వారా ఓబీసీ, దళిత, ఆదివాసీ వర్గాల హక్కులను కేంద్రం దోచుకుంటోందని ('హిస్సా చోరీ') ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఇంద్రజాలికుడు అడ్డంగా దొరికిపోయారు**

ప్రధాని మోదీని ఇంద్రజాలికుడితో పోలుస్తూ, ఆయన మ్యాజిక్ ట్రిక్స్ ఇప్పుడు పని చేయడం లేదని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఇంద్రజాలికుడు ఇప్పుడు అడ్డంగా దొరికిపోయారు అని ఆయన విమర్శించారు. బాలాకోట్ స్ట్రైక్స్, నోట్ల రద్దు వంటివి గతంలో ప్రధాని చూపిన మ్యాజిక్ ట్రిక్స్ అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు డీలిమిటేషన్ బిల్లు ద్వారా దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చాలని మోదీ చూస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత ఆరోపించారు. దేశ రాజకీయాల్లో జరుగుతున్న మార్పులను చూసి మోదీ ప్రభుత్వం భయపడుతోందని, అందుకే మహిళా రిజర్వేషన్ల ముసుగులో నియోజకవర్గాల పెంపు చేపట్టి తమ బలాన్ని పెంచుకోవాలని చూస్తోందన్నారు. నిజమైన శక్తి ఎప్పుడూ చీకటిలోనే దాగి ఉంటుంది, అది బయటకు కనిపించదని ఒక కథ రూపంలో ఇంద్రజాలికుడి ఉదాహరణను రాహుల్ వివరించారు.

**ప్రధానిని ఇంద్రజాలికుడు అని పిలవడం సరికాదు : రిజిజు**

ఇక రాహుల్ గాంధీ ప్రధానిని ఇంద్రజాలికుడు అని పిలవడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి పదాలు అసభ్యకరమైన పదజాలం కిందకు వస్తాయన్నారు. ఇక రాహుల్ వ్యాఖ్యలపై స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని, సభలో గౌరవప్రదమైన భాషను వాడాలని హెచ్చరించారు. చర్చలోని అంశానికి లోబడి మాట్లాడాలని సూచించారు. ఈ క్రమంలో సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి, సభ గందరగోళంగా మారింది.

**16 ఇప్పుడొక చిక్కుముడిలా మారింది**

పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభమైన తేదీలోని 16 అనే అంకె ఇప్పుడొక చిక్కుముడిలా మారిందని రాహుల్ అన్నారు. ఈ తేదీ వెనుక ఒక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. రాహుల్ తన ఫోన్‌ను చూసుకుంటూ 16వ తేదీ కోసం ఎదురుచూడండి, ఆ నంబర్ 16లోనే ఈ చిక్కుముడికి సమాధానం ఉందని వ్యాఖ్యానించారు. ఏప్రిల్ 16న ప్రభుత్వం హడావుడిగా మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులను ప్రవేశపెట్టడం వెనుక ఒక రకమైన భయం కనిపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గాల మ్యాప్‌ను మార్చే ఉద్దేశంతోనే ఈ 16వ తేదీని ఎంచుకున్నారని రాహుల్ చెప్పారు. ఇవాళ ప్రధాని మోదీ ప్రసంగం శక్తి హీనంగా సాగిందని చెబుతూ, ఈ మొత్తం వ్యవహారమంతా "16" అనే అంకె చుట్టూ తిరుగుతోందని రాహుల్ చేసిన వ్యాఖ్యలు సభలో చర్చనీయాంశమయ్యాయి.

**కుల గణనను బేఖాతరు చేసే యత్నం**

'ఓబీసీలకు అధికారం, చట్టసభల్లో ప్రాతినిధ్యం ఇవ్వాలనే ఆలోచనే మోదీ సర్కారుకు లేదు. వాళ్ల అజెండా కూడా అదే. రాబోయే 15 సంవత్సరాల పాటు చట్టసభల్లో ప్రాతినిధ్యానికి కుల గణనతో ఎలాంటి సంబంధం లేకుండా చేసేందుకు కేంద్రం యత్నిస్తోంది. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాల నుంచి చట్టసభల ప్రాతినిధ్యాన్ని లాక్కోవాలని బీజేపీ భావిస్తోంది. అలా జరగకుండా మేం అడ్డుకుంటాం. ఆయా రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని ప్రభుత్వం టచ్ చేయకుండా మేం చూస్తాం' అని రాహుల్ తెలిపారు.

**ఈ బిల్లు ఆమోదం పొందదని బీజేపీకి తెలుసు**

'యావత్ విపక్షాలు కలిసి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాన్ని ఓడిస్తాయి. డీలిమిటేషన్‌తో లింకు కలిగిన మహిళా కోటా బిల్లు ఆమోదం పొందదని బీజేపీకి బాగా తెలుసు. అయినప్పటికీ దేశ ఎలక్టోరల్ మ్యాప్‌ను (నియోజకవర్గాల స్వరూపాన్ని) మార్చేందుకు ఆ పార్టీ సిద్ధమైంది. ఇక ఇదే సమయంలో తనను తాను మహిళా పక్షపాతిగా చూపించుకోవాలని మోదీ భావిస్తున్నారు. బీజేపీ వాళ్లు తామే భారత ప్రజలం, తామే భారత సైనికులం అని భావిస్తున్నారు. వాస్తవం ఏమిటంటే, వాళ్లు అవేవీ కాదు. అందుకే భారత ప్రజలు, సైనికుల మాటున నిలిచి వ్యాఖ్యలు చేయడాన్ని బీజేపీ వాళ్లు ఆపాలి' అని రాహుల్ చెప్పారు.

**లోక్‌సభలో వాగ్వాదం**

శుక్రవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా తీవ్ర గందరగోళం ఏర్పడింది. నియోజకవర్గాల పునర్విభజన వల్ల జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా కేటాయించాలని, కుల గణనను వెంటనే చేపట్టాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఇప్పుడు కేంద్రం ప్రవేశపెట్టిన మహిళా కోటా బిల్లు మహిళల సాధికారత కోసం కాదని, కుల గణనను పక్కదారి పట్టించేందుకే దీన్ని తెరపైకి తెచ్చిందని ఆయన మండిపడ్డారు. దీనిపై అధికార పక్షం తీవ్రంగా స్పందించడంతో సభలో వాగ్వాదం చోటుచేసుకుంది. బీజేపీ అధికారాన్ని శాశ్వతం చేసుకునేందుకు చిన్న రాష్ట్రాలు, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే కుట్ర చేస్తోందని ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు.

# షేక్ హసీనాను బంగ్లాకు అప్పగించే అంశాన్ని సమీక్షిస్తున్నాం



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలంటూ ఆ దేశం నుంచి వచ్చిన అధికారిక అభ్యర్థనపై భారత్ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ అంశంపై చట్టపరమైన, న్యాయ మార్గాల ద్వారా సమీక్షిస్తున్నట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ తెలిపారు. బంగ్లాలో నెలకొన్న అనేక నాటకీయ రాజకీయ మార్పుల అనంతరం ఏర్పడిన కొత్త ప్రభుత్వంతో తన భాగస్వామ్యాన్ని స్థిరీకరణకు భారత్ ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "ప్రస్తుతం కొనసాగుతున్న న్యాయ, అంతర్గత చట్టపరమైన ప్రక్రియల్లో భాగంగా బంగ్లాదేశ్ అభ్యర్థనను పరిశీలిస్తున్నాం. ఈ విషయంపై సంబంధిత వర్గాలు అన్నింటితో నిర్మాణాత్మకంగా చర్చలు కొనసాగిస్తాము. అన్ని పరిణామాలను మేము చాలా నిశితంగా గమనిస్తున్నాం. కొత్త ప్రభుత్వంతో నిర్మాణాత్మకంగా కలిసి పనిచేయడానికి, ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే భారత్? ఆకాంక్షను విదేశాంగ మంత్రి ఇప్పటికే చెప్పారు. వాణిజ్యం, ఇంధనం, ప్రాంతీయ భద్రత రంగాల్లో సహకారం కోసం కొత్త ప్రతిపాదనలను అన్వేషించడానికి అధికారిక మార్గాలను ఉపయోగించుకోవడానికి ఇరు దేశాలు అంగీకరించాయి. ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై ఇరు దేశాల దృక్పథాలను ఏకీకృతం చేయడానికి త్వరలోనే అధికారిక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం. అటు హసీనా అప్పగింతపై ప్రతిష్టంభన ఉన్నప్పటికీ భాగస్వామ్యం పటిష్టంగా కొనసాగుతుంది." 2024 జూలైలో విద్యార్థుల నేతృత్వంలోని తిరుగుబాటుతో అప్పటి బంగ్లాదేశ్? ప్రధాని షేక్ హసీనా దేశం వదిలి వచ్చి భారత్?లోనే ఉంటున్నారు. అయితే, స్వదేశంలో చేపట్టిన విచారణను ఎదుర్కొనేందుకు హసీనాను తిరిగి అప్పగించాలని భారత్?ను బంగ్లాదేశ్? కోరింది. 2025లోనే బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలంటూ తమకు లేఖ అందినట్లు భారత్? అంగీకరించింది. అయితే ఈ అభ్యర్థనను ప్రస్తుతం చట్టాల ప్రకారం సమీక్షిస్తున్నట్లు తెలిపింది. ఈ ప్రక్రియ అంతర్గత చట్టపరమైన నిబంధనలకు లోబడి ఉంటుందని జైశ్వాల్ స్పష్టం చేశారు.

**తారిఖ్ రెహ్మాన్ పార్టీ విజయంతో భారత్– బంగ్లాదేశ్‌ల మధ్య సంబంధాలపై మళ్లీ ఆశలు**

గతంలో మాజీ ప్రధాని షేక్ హసీనా హయాంలో బంగ్లాదేశ్‌కు భారత్‌తో చాలా మంచి సంబంధాలు ఉండేవి. కానీ, అక్కడి విద్యార్థుల తిరుగుబాటుతో ఆమె అధికారం కోల్పోయింది. అనంతరం మహ్మమద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక సర్కార్‌తో భారత్– బంగ్లాదేశ్?ల మధ్య సంబంధాలు తీవ్రంగా క్షీణించాయి. అయితే, ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తారిఖ్? రెహ్మాన్? నేతృత్వంలోని పార్టీ విజయం సాధించడంతో భారత్– బంగ్లాదేశ్‌ల మధ్య సంబంధాలపై మళ్లీ ఆశలు చిగురుస్తున్నాయి.

**ఇజ్రాయెల్– లెబనాన్ కాల్పుల విరమణకు భారత్? అధికారిక మద్దతు**

ఇదిలా ఉండగా ఇజ్రాయెల్– లెబనాన్‌ల మధ్య ఇటీవల అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణకు భారత్? అధికారిక మద్దతు ప్రకటించింది. ప్రాంతీయ స్థిరత్వాన్ని లక్ష్యంగా చేసుకునే అన్ని ప్రయత్నాలకు తాము మద్దతిస్తామని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. శాంతి దిశగా వేసే ప్రతి అడుగును భారతదేశం స్వాగతిస్తుందని వీజూా ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వ్యాఖ్యానించారు. అటు ఇరాన్– అమెరికాల మధ్య శాంతి ప్రక్రియలో పాకిస్థాన్ ప్రమేయం గురించి ప్రశ్నించగా, ఈ పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని పేర్కొన్నారు. "పశ్చిమాసియా యుద్ధంలోని అన్ని పరిణామాలను మేము నిశితంగా గమనిస్తున్నాము" అని జైశ్వాల్ అన్నారు. లెబనాన్–ఇజ్రాయెల్‌ల మధ్య 10 రోజుల కాల్పుల విరమణ గురువారం నుంచి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఇరు దేశాల నాయకత్వాల మధ్య తొలి సమావేశాన్ని సులభతరం చేసేందుకు తాను ప్రయత్నిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పిన తరుణంలో కాల్పుల విరమణ జరిగింది.

# అన్ని నౌకలకు అనుమతి



ప్రపంచానికి ఇది గుడ్‌న్యూస్. అందరూ ఎప్పుడెప్పుడు ఓపెన్ అవుతుందా అని ఎదురుచూసిన హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీ ఈ మేరకు సోషల్ మీడియాలో దీనిపై శుక్రవారం ఒక ప్రకటన చేశారు. ఇకపై హోర్ముజ్ జలసంధి అందరికీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇటీవలే అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య గురువారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. పది రోజులపాటు కాల్పుల విరమణ కొనసాగనుంది. ఈ నేపథ్యంలోనే హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నంత కాలం జలసంధి తెరిచి ఉంచే అవకాశం ఉంది. "లెబనాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమలు నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నాం. ఈ ఒప్పందం అమలులో ఉన్నంతకాలం హోర్ముజ్‌ను అందరికీ అందుబాటులోకి తెస్తున్నాం. అన్ని రకాల వాణిజ్య నౌకల్ని అనుమతిస్తాం. ఈ అంశంపై ఇప్పటికే అన్ని పోర్టులకు సమాచారం అందించాం. సంబంధిత రూట్ల గురించి కూడా తెలియజేశాం" అని అరాగ్చీ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా స్పందించారు. హోర్ముజ్‌ను తెరిచేందుకు ఇరాన్ అంగీకరించిందని తన సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఇరాన్ ఈ నిర్ణయానికి తీసుకోవడానికి లెబనాన్–ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందమే కారణం. దీనికి కూడా ట్రంప్ తనవంతు ప్రయత్నం చేశారు. అంతేకాదు.. ఇరు దేశాల అధ్యక్షుల్ని చర్చలు జరిపేందుకు ఒప్పిస్తానని ట్రంప్ అన్నారు. హోర్ముజ్ జలసంధి అందుబాటులోకి వస్తే ప్రపంచంలోని అనేక దేశాల చమురు కష్టాలు తీరుతాయి. అంతేకాదు.. ఆహారం, ఎరువులు, ఔషధాలు వంటివి కూడా అందుబాటులోకి వస్తాయి. మరోవైపు ఇరాన్ చేసిన ఈ ప్రకటనతో అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా తగ్గుముఖం పడుతున్నాయి.

## ఉత్తరాది, దక్షిణాది భేదాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదు



ఉత్తరాది, దక్షిణాది భేదాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండియా కూటమి సభ్యులు వ్యతిరేకించారని ఆరోపించారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకు విపక్ష కూటమి వ్యతిరేకమని విమర్శించారు. నారీమణులకు మేలు చేసే బిల్లులను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రతిపక్ష పార్టీలను ప్రశ్నించారు. మహిళా సాధికారత దిశగా చేసే పనులకు ఎందుకు మద్దతివ్వడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలుచేసేలా ముందుకెళ్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుత లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో తీవ్ర వ్యత్యాసం ఉందన్నారు. ఒక ఎంపీ లక్షల మంది ప్రజల సమస్యలను ఎలా వినగలరని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సీట్ల పెంపుదలను కూడా విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై జరిగిన చర్చకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమాధానమిచ్చారు.

## డీలిమిటేషన్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి



డీలిమిటేషన్ బిల్లును విపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సీట్ల సంఖ్యను మార్చకుండా, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరుతున్నాయి. అలాగే నియోజకవర్గాలను పునర్విభజన బిల్లు కుట్రతో నిండి ఉందని ఆరోపిస్తున్నాయి. దేశంలోని చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లను వేగంగా అమలు చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో గురువారం ప్రవేశపెట్టిన మూడు కీలక బిల్లులపై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో విపక్షాలు స్పందించాయి.

**ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేయాలనుకుంటున్నారు**
**కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్**

ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల (543) సంఖ్యను మార్చకుండానే, 2023లో తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి, రాజ్యాంగ (131వ సవరణ) బిల్లును ఉపసంహరించుకోవాలని అన్నారు. అలా చేస్తే మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలుకు ప్రతిపక్షాలు మద్దతు ఇస్తాయని తెలిపారు. మహిళలకు రిజర్వేషన్ల పేరిట మోదీ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేయాలనుకుంటుందని, దాన్ని తాము అనుమతించబోమన్నారు. "2023 నాటి మహిళా రిజర్వేషన్ల చట్టం నోటిఫికేషన్ నిన్న (గురువారం) రాత్రి వెలువడింది. మోదీ సర్కార్ మహిళా సాధికారత గురించి మాట్లాడుతోంది. ప్రధాని మోదీ నాటకాన్ని మేము చూశాము. 2023 నాటి చట్టాన్ని గురువారం రాత్రి నోటిఫై చేశారు. వారికి నిజాయితీ ఉంటే చట్టం అమలులో ఈ జాప్యం ఎందుకు?. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కేంద్రమే జాప్యం చేసింది" అని పార్లమెంట్ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు.

**రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలని కుట్ర : తేజస్వీ యాదవ్**

మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లును చాలా చాకచక్యంగా మోదీ సర్కార్ తీసుకొచ్చిందని ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలని చూస్తోందని అన్నారు. అంతేకాకుండా బీజేపీ, ఆర్ఎస్ఎస్ తమ అజెండాను అమలు చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. "మహిళా రిజర్వేషన్ల బిల్లులో నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని చాలా తెలివిగా చేర్చారు. ఈ రెండూ పూర్తిగా వేర్వేరు అంశాలు. మహిళా రిజర్వేషన్ బిల్లు గతంలోనే ఆమోదం పొందింది. ఆ సమయంలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, అలాగే ఓబీసీ మహిళలకు కూడా రిజర్వేషన్ ఇవ్వాలని మేము డిమాండ్ చేశాం. కానీ అది జరగలేదు. మహిళా రిజర్వేషన్ అంశాన్ని కేవలం ప్రచార ఆర్భాటం కోసమే మోదీ ప్రభుత్వం ముందుకు తీసుకువస్తోంది. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలని చూస్తోంది. అందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతోంది. ఆర్ఎస్ఎస్, బీజేపీ తమ అజెండాను అమలు చేయాలని చూస్తున్నాయి. అందుకు మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం." అని ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వీ యాదవ్ తెలిపారు.

**ఈ బిల్లు భారీ కుట్రతో నిండి ఉంది : తమిళనాడు సీఎం స్టాలిన్**

లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని, అధికారాన్ని తగ్గించేందుకు డీలిమిటేషన్ బిల్లు 2026ను తీసుకొచ్చారని, ఇందులో భారీ కుట్ర ఉందని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ఆరోపించారు. ఈ డీలిమిటేషన్ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లు ప్రస్తుత రూపంలో పూర్తి మోసం తప్ప మరేమీ లేదన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన డీలిమిటేషన్ కమిషన్ ద్వారా భారతీయ జనతా పార్టీ తమకు నచ్చిన రీతిలో నియోజకవర్గాలను పునర్విభజన చేసుకునేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తోందని ఆరోపించారు. ఈ నల్ల చట్టం ఒక పెద్ద కుట్రతో నిండి ఉందని మండిపడ్డారు. తమ ఆవేదనను లెక్కచేయకుండా అహంకారంతో డీలిమిటేషన్ చేస్తే తమిళనాడులో కేంద్రం తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్టాలిన్ హెచ్చరించారు.

**ఎన్‌డీఏ సర్కార్ అత్యంత నిజాయితీ లేనిది**
**ఎస్పీ ఎంపీ రామ్‌గోపాల్ యాదవ్**

మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రను చెరిపేయాలని కేంద్ర ప్రభుత్వం ఎందుకు యత్నిస్తోందని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్ ఆరోపించారు. 2023లో ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినప్పుడే దానికి ఏకగ్రీవ మద్దతు లభించిందని గుర్తు చేసుకున్నారు. అలాగే బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అత్యంత అవినీతిమయమైనది, నిజాయితీ లేనిదని మండిపడ్డారు.

**సీట్లు పెరుగుతాయ్– ఎవరూ నష్టపోరు : బీజేపీ నేత అన్నామలై**

డీలిమిటేషన్ బిల్లు వల్ల తమిళనాడులో ఎంపీ సీట్ల సంఖ్య 39 నుంచి 59కు పెరగుతుందని బీజేపీ నేత అన్నామలై స్పష్టం చేశారు. అంటే తమిళనాడులో 50 శాతం ఎంపీ స్థానాలు పెరుగుతాయన్నారు. ఈ బిల్లు అమలు తర్వాత కూడా లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం వాటా 21.9 శాతంగానే ఉంటుందని, అందులో ఎటువంటి మార్పు ఉండదన్నారు. ఈ బిల్లు ద్వారా ఏ రాష్ట్రం ఎంపీ సీట్లలో కోత పడదని, ఎవరూ నష్టపోరని వెల్లడించారు. మదురైలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఈ మేరకు అన్నామలై వ్యాఖ్యానించారు.

# ఏరోస్పేస్ వ్యూహాత్మక కేంద్రంగా తెలంగాణ

-మొదటిపేజీ తరువాయి
అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. 'ఏరోస్పేస్' అంటే కేవలం యంత్రాల తయారీ మాత్రమే కాదని, ఇప్పుడున్న పరిస్థితుల్లో అది ఒక దేశ వ్యూహాత్మక శక్తికి, ఆత్మవిశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ఈ రంగంలో ఒకప్పుడు.. యూఎస్, రష్యా, ఐరోపా దేశాలదే ఆధిపత్యం చెలాయించేవని, ఇప్పుడు వాటికి ధీటుగా 'గ్లోబల్ సప్లై చైన్'లో మన దేశం కూడా 'కీ' రోల్ ప్లే చేస్తోందన్నారు. యునెస్కో గణాంకాల ప్రకారం ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో సైంటిస్టులు, ఇంజనీర్లు మన దేశంలోనే ఉన్నారన్నారు. కానీ... మెకిన్సే నివేదిక ప్రకారం.. ల్యాబ్‌ల్లో జరిగే పరిశోధనల్లో 30 శాతం కూడా కమర్షియల్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పరిశోధనల్ని ఉత్పత్తులుగా మార్చాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామన్నారు. డెలాయిట్ గ్లోబల్ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ సర్వే ప్రకారం.. నేడు 74 శాతం మంది ఏరోస్పేస్ సీఈఓలు కేవలం తక్కువ ఖర్చు కంటే పటిష్ఠమైన సప్లై-చైన్, తయారీ సామర్థ్యానికే ప్రాధాన్య మిస్తున్నారన్నారు. రాబోయే 20 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా 42,000 కొత్త ఎయిర్ క్రాఫ్ట్ అవసరం ఉంటుందని బోయింగ్, ఎయిర్‌బస్ సంస్థలు అంచనా వేశాయన్నారు. ఈ డిమాండ్‌ను 'హైదరాబాద్' అందిపుచ్చుకునేలా ఇప్పటికే ఇక్కడున్న ప్రిసిషన్ ఇంజనీరింగ్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ నెట్‌వర్క్, బలమైన ఎంఎస్ఎంఈ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ఇప్పటికీ మనం ఏరోస్పేస్ టెస్టింగ్, సర్టిఫికేషన్ కోసం విదేశాలపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. ఫలితంగా ఖర్చు పెరగడమే కాకుండా.. ఉత్పత్తుల గ్రౌండింగ్‌కు 18 నెలల నుంచి 24 నెలల వరకు అదనపు సమయం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ స్థాయి సర్టిఫికేషన్ ఎకో సిస్టంను అభివృద్ధి




చేసేందుకు 'హైదరాబాద్' అన్ని రకాలుగా అనుకూలంగా ఉందని.. ఆ దిశగా కేంద్రం చొరవ చూపాల్సిన అవసరముందన్నారు. డ్రోన్లు, రీయూజబుల్ రాకెట్లు, ఏఐ ఏవియానిక్స్, 3డీ ప్రింటింగ్, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ తదితర అంశాలు రాబోయే రోజుల్లో ఏరోస్పేస్ భవిష్యత్తును శాసిస్తాయన్నారు. అందుకు అనుగుణంగానే.. ఇప్పటి నుంచే 'తెలంగాణ'ను సిద్ధం చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో ఉన్న 1,500కు పైగా ఎంఎస్ఎంఈలు ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ దిగ్గజ సంస్థలకు విడిభాగాలను సరఫరా చేస్తూ 'మేడిన్ తెలంగాణ' బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్ ఆర్అండ్ డీ ఇన్‌స్టిట్యూషన్లు, గ్లోబల్ ఓఈఎంలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఆదిభట్ల ఏరోస్పేస్ ఎస్ఈజెడ్, ప్రత్యేక ఏరోస్పేస్ పార్కులు, రోడ్డు నెట్ వర్క్ తదితర మౌలిక సదుపాయాలు, టాలెంట్ పూల్... ప్రపంచ ఏరో స్పేస్ దిగ్గజ సంస్థలు తెలంగాణ వైపు చూసేలా చేశాయన్నారు. 'హైదరాబాద్' వేదికగా ఏరోస్పేస్ భవిష్యత్తును నిర్మించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తోన్న రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, ఆవిష్కర్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. అనంతరం ఏరోస్పేస్ రంగంలో విశేష కృషి చేసిన పలువురు శాస్త్రవేత్తలు, ప్రముఖులను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ సభ్యులు డా.వీకే సారస్వత్, డీజీ సీఎస్ఐఆర్ అండ్ డీఎస్ఐఆర్ సెక్రటరీ డీ.ఎన్ కళైసెల్వి, 'ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా' ప్రతినిధులు డా.సతీష్ రెడ్డి, డా.సోమనాథ్, రాజబాబు, డా.శివ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# రాజధాని పరిధిలో పురుషుల కంటే మహిళలే ఎక్కువ

-మొదటిపేజీ తరువాయి
ఉండటం ఇక్కడ విశేషం. జీహెచ్ఎంసీ, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో సామాజిక వర్గాల వారీగా లింగ నిష్పత్తిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు, ప్రజల్లో అవగాహన, మారుతున్న సామాజిక దృక్పథానికి ఈ ఫలితాలే నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు.

**జీహెచ్ఎంసీలో**

జీహెచ్ఎంసీ పరిధిలో లింగనిష్పత్తి 1078గా ఉంది. అంటే ఇక్కడ ప్రతి 1000 మంది పురుషులకు 1078 మహిళలు ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా బీసీ-ఏలో (1090), బీసీ-ఈ (1087), ఓసీల్లో (1108) వర్గాల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా బలంగా ఉంది. ముస్లిం మైనారిటీలు(బీసీ-ఈ)లో లింగ నిష్పత్తి 1087గా ఉంది. బీసీ-సి(962) వర్గాల్లో మాత్రం పురుషులతో పోలిస్తే మహిళల జనాభా తక్కువగా ఉంది.

**రంగారెడ్డి జిల్లా..**

రంగారెడ్డి జిల్లాలో 1095 లింగ నిష్పత్తితో తెలంగాణలోనే అగ్రస్థానంలో నిలిచింది.
ఓసీల్లో 1145తో పురుషుల కంటే మహిళల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. రాష్ట్రంలోనే ఇది అత్యధికం.
ఎస్టీల్లో లింగ నిష్పత్తి 1137గా నమోదైంది. బీసీ-సి సామాజిక వర్గంలో 1008గా లింగ నిష్పత్తి ఉంది.

**మేడ్చల్-మల్కాజిగిరిలో..**

మేడ్చల్ జిల్లాలో సగటు లింగ నిష్పత్తి 1066గా ఉంది.
ఈ జిల్లాల్లో ఎస్టీ సామాజిక వర్గంలో 1088, ఓసీల్లో 1097, బీసీల్లో 1053 నిష్పత్తిలో మహిళలు ఉన్నారు. ఎస్సీల్లో సగటు 1026గా ఉంది.
1000 : 1095

**నగర జీవనంలో అతివల సారథ్యం**

పట్టణ ప్రాంతాల్లో సామాజిక మార్పు స్పష్టంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మూడు జిల్లాల గణాంకాలను పరిశీలిస్తే కుటుంబానికి మహిళలు వెన్నుదన్నుగా నిలుస్తున్నట్లు ఈ లెక్కలు చెబుతున్నాయి. జీహెచ్ఎంసీలో 21.8 శాతం,



రంగారెడ్డి జిల్లాలో 20.4శాతం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 18.9శాతం మంది మహిళలే ఇంటి యజమానులుగా ఉండటం అభినందనీయమైన విషయం. ఈ లెక్కన తెలంగాణవ్యాప్తంగా సగటు 23.9 శాతంగా ఉంది.

**నెలకు రూ.5 వేల సంపాదన**

మహానగరం హైదరాబాద్‌లో నెలకు కేవలం రూ.5 వేలలోపు సంపాదనతో సగటున 9 శాతం మంది జీవనం కొనసాగిస్తున్నారు. ఇది రాష్ట్ర సగటు(12శాతం) కంటే తక్కువగా ఉంది. రంగారెడ్డి జిల్లాలో 9.3 శాతం, జీహెచ్ఎంసీలో 9.2 శాతం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 8.1 శాతం మంది ప్రజల వార్షిక ఆదాయం ఏడాదికి రూ.50 వేల లోపు మాత్రమే ఉంది.

ఇంకా బావులు, చేతి పంపులు

గ్రేటర్ హైదరాబాద్‌లో 89 శాతం మందికి కుళాయిలు ఉండగా మేడ్చల్ జిల్లాలో 86.3 శాతం, రంగారెడ్డి జిల్లాలో 85.3 శాతంగా ఉంది. గ్రేటర్ పరిధిలో చేతిపంపులపై ఆధారపడిన వారు ఇప్పటికీ 3.3 శాతం, మేడ్చల్ జిల్లాలో 2 శాతం, రంగారెడ్డి జిల్లాలో 2.4.శాతం మంది ఉన్నారు.

**కులాంతర వివాహాల్లో టాప్**

రాష్ట్రంలోనే కులాంతర వివాహాల్లో అగ్రస్థానంలో జీహెచ్ఎంసీ ఉండగా తర్వాత స్థానాల్లో మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలు చోటు దక్కించుకున్నాయి. గ్రేటర్ పరిధిలో 14.3 శాతం కులాంతర వివాహాలు జరగ్గా, మేడ్చల్ జిల్లాలో 9.9.శాతం, రంగారెడ్డి జిల్లాలో 8.4 శాతంగా నమోదు అయ్యాయి.

**ముందస్తు వివాహాలు అధికం**

జీహెచ్ఎంసీలో ముందుస్తు వివాహాలు ఎక్కువగా ఉన్నాయి. 11.1 శాతం మంది పురుషులు పెళ్లి వయస్సు రాక ముందే వివాహాలు చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లాలో 7 శాతం పురుషులు, 7.3 శాతం స్త్రీలు, మేడ్చల్‌లో పురుషులు 6.6శాతం, స్త్రీలు 6.8శాతం మేర చట్టబద్ధ వయసులోపే వివాహ జీవితంలోకి అడుగుపెట్టారు.

**వైద్యం కోసం, రుణమే శరణ్యం!**

వైద్య చికిత్సల కోసం పేదలు రుణాలు తెచ్చి మరీ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆరోగ్యశ్రీ లాంటి పథకాలున్నప్పటికీ ఏ మాత్రం ఊరట లేదు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో దాదాపు 11.5 శాతం మంది మెడికల్? పరంగా అప్పులు చేస్తున్నారు. నగరంలోని ఎస్సీ కేటగిరీ పేదలు దాదాపు 12.5 శాతం మంది అప్పుల కోసం అనధికార వడ్డీ వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారు.


**గ్రేటర్‌లో అక్షరాస్యులు 90 శాతం**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు జిల్లాల్లో కుటుంబ సమగ్ర సర్వేను పరిశీలిస్తే ఆరేళ్ల నుంచి 29 ఏళ్ల వారిలో చదువుకున్న వారు 90 శాతం మంది ఉన్నారు. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలో 84.7శాతం మంది ఉండగా, అత్యధికంగా మేడ్చల్ జిల్లాలో 90.4శాతం మంది విద్యావంతులున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో చదువుకున్న విద్యార్థుల్లో అత్యధికంగా ఇంగ్లీష్ మీడియం వారున్నారు. రెండో స్థానంలో తెలుగు, మూడో స్థానంలో ఉర్దూ మీడియం విద్యార్థులు ఉన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో తెలుగును మాతృ భాషగా మాట్లాడేవారు 53.10శాతంమంది ఉంటే, ఉర్దూ మాతృ భాషగా మాట్లాడేవారు 37.5 శాతం మంది. హిందీ మాతృ భాషగా మాట్లాడుతున్న వారు 6 శాతం ప్రజలు ఉన్నారు.

# 22 శాతం మందికే లక్ష పైన ఆదాయం

## ప్రైవేటులో అగ్రవర్ణాల చదువులు.. ప్రభుత్వ బడుల్లో ఎస్సీ ఎస్టీలు

**హైదరాబాద్ :** తెలంగాణలో కులగణన రిపోర్టులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. రాష్ట్రంలోని 78 శాతం కుటుంబాలకు ఆదాయం ఏడాదికి రూ. లక్ష కంటే తక్కువగానే ఉందని తెలిపింది. అదే సమయంలో తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలు.. అగ్రవర్ణాల కంటే 3 రెట్లు వెనుకబడి ఉన్నాయని తేలింది. అదే సమయంలో మొత్తం 242 కులాలు ఉండగా.. అందులో 135 కులాలను అత్యంత వెనుకబడినవిగా గుర్తించారు.తెలంగాణలో కొన్ని రోజుల క్రితం నిర్వహించిన కులగణన సర్వేకు సంబంధించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నివేదికలో రాష్ట్రంలో కులాలకు సంబంధించిన సమగ్ర సమాచారం బయటికి వచ్చింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో మొత్తం 3.55 కోట్ల మంది ప్రజలు ఉన్నారని వెల్లడించింది. అంతేకాకుండా కులాలకు సంబంధించి కూడా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అదే సమయంలో విద్య, ఆర్థిక రంగాల్లో చాలా కుటుంబాలు వెనుకబడి ఉన్నాయని ఈ రిపోర్టు తెలిపింది. తెలంగాణలోని మొత్తం 242 కులాల్లో 135 కులాలు అత్యంత వెనుకబడినవిగా ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర జనాభాలోని 67 శాతం మంది ప్రజలు ఈ 135 కులాలకు చెందిన వారేనని వెల్లడైంది. ఇక రాష్ట్ర సగటు కంటే ఈ కులాలు ఎక్కువగా వెనుకబడి ఉండటం తీవ్ర ఆందోళన కలిగించే అంశంగా మారింది.మరీ ముఖ్యంగా ఎస్టీల్లో 99 శాతం..



ఎస్సీల్లో 97 శాతం.. బీసీల్లో 71 శాతం మంది ప్రజలు.. తెలంగాణ రాష్ట్ర సగటు కంటే చాలా వెనుకబడి ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇక అగ్రవర్ణాలకు చెందిన 18 కులాలు రాష్ట్ర సగటు కంటే మెరుగైన స్థితిలో ఉన్నాయని సీబీఐ ర్యాంకింగ్స్ చెబుతున్నాయి. ఇక రాష్ట్రంలోని 78.2 శాతం కుటుంబాల సంవత్సర ఆదాయం రూ.లక్ష కంటే తక్కువగానే ఉన్నట్లు ఈ నివేదిక విస్తుపోయే నిజాలను బహిర్గతపరిచింది. సామాజిక వర్గాల వారీగా చూస్తే.. అత్యధికంగా ఎస్టీల్లో 88.2 శాతం.. ఎస్సీల్లో 86.2 శాతం కుటుంబాలు పేదరికంలో మగ్గిపోతున్నాయని వెల్లడైంది.అదే సమయంలో రాష్ట్రంలోని అగ్రవర్ణాల కంటే ఎస్సీ, ఎస్టీలు మూడు రెట్లు ఎక్కువగా వెనుకబడి ఉన్నట్లు ఈ నివేదిక తెలిపింది. ఇక బీసీలు కూడా అగ్రవర్ణాల కంటే 2.7 రెట్లు వెనుకబడి ఉన్నారని పేర్కొంది. ఇక అగ్రవర్ణాల్లో కూడా దాదాపు సగం మంది అంటే 43.8 శాతం కుటుంబాలు మాత్రమే లక్ష కంటే ఎక్కువ వార్షిక ఆదాయం కలిగి ఉన్నాయని తేలింది. ఏడాదికి రూ.5 లక్షల కంటే అధిక ఆదాయం ఉన్నవారిలో అగ్రస్థానంలో 13.2 శాతంతో అగ్రవర్ణాలు ఉండగా.. ఎస్సీ, ఎస్టీలు కేవలం 2.1 శాతం మాత్రమే ఉన్నారని తేలింది. ఆదాయపు పన్ను కడుతున్న వారిలో 23.5 శాతం మంది అగ్రవర్ణాలకు చెందిన వారే కావడం గమనార్హం.సామాజిక వర్గాల మధ్య వ్యత్యాసాలు విద్యారంగంలో కూడా ఉన్నాయని ఈ నివేదిక తెలిపింది. అగ్రవర్ణాలకు చెందిన వారిలో 34 శాతం మంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. అదే సమయంలో ఎస్సీల్లో 15 శాతం, ఎస్టీల్లో కేవలం 13 శాతం మంది మాత్రమే ప్రైవేటు బడుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. డిప్లొమా అంతకంటే ఎక్కువ ఉన్నత విద్య చదువుతున్న వారిలో 57 శాతంతో అగ్రవర్ణాలు ముందుండగా.. 31 శాతంతో ఎస్టీలు వెనుకబడి ఉన్నారని వెల్లడైంది. ఇక ఇంగ్లీష్ మీడియం చదువుల్లోనూ 66 శాతంతో అగ్రవర్ణాలు ముందంజలో ఉండగా.. ఎస్టీలు 36 శాతానికే పరిమితమయ్యారు.

## వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ టాప్

-మొదటిపేజీ తరువాయి
కోరింది. రాష్ట్రంలో యాసంగి పంట రానున్న నేపథ్యంలో సేకరణ, మార్కెటింగ్‌పై ప్రభుత్వం దృష్టి సారించింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌తో కలిసి కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయ్యారు. యాసంగిలో వచ్చే ధాన్యం బాయిల్డ్ రైస్‌కు అనుకూలమని ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి ఉత్తమ్ తెలిపారు. గత ఆరు సీజన్ల కస్టమ్ మిల్లింగ్ రైస్ గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమౌతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందన్న మంత్రి ఉత్తమ్ 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కోరారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు భారీ డిమాండ్ ఉన్నందున సరఫరా పెంచాలని ఇటీవల కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధికారులు సూచించిన విషయాన్ని గుర్తు చేశారు.
2014 --15 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించిన దాదాపు 14 వందల 69 కోట్ల బకాయిలను విడుదల చేయాలని కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉందన్న సీఎం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మీద ఉన్న ఒత్తిడిని గుర్తించి వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపాల నివారణకు గానూ కేంద్రం ప్రవేశపెట్టిన ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ సరఫరాను ఇటీవల నిలిపివేశారన్న సీఎం దానిని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. బాయిల్డ్ రైస్ సరఫరాకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదనకు కేంద్రమంత్రి సూత్రప్రాయ ఆమోదం తెలిపారని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

**రైతుల అకౌంట్‌లో నగదు జమ**

ఈ రబీ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయనున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు 48 గంటల్లో కనీసమద్దతు ధరకు (ఎంఎస్పీ) తగ్గట్టు వారి బ్యాంక్ అకౌంట్‌లో నగదును జమ చేయనున్నామని తెలిపారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణకు సంబంధించిన 30 లక్షల మెట్రిక్? టన్నుల బాయిల్డ్‌రైస్‌ను కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోవాలని తాము కేంద్ర మంత్రిని కోరినట్లు వివరించారు. “ఈ రబీ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయనున్నాం. రాష్ట్రంలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు 48 గంటల్లో కనీసమద్దతు ధరకు (ఎంఎస్పీ) తగ్గట్టు వారి బ్యాంక్ అకౌంట్‌లో నగదును వేయనున్నాం. ఈ పరిస్థితుల్లో తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్‌ను కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోవాలని మేము కేంద్ర మంత్రిని కోరాం

## పురుషుల్లో రొమ్ము క్యాన్సర్

**హైదరాబాద్ :** ప్రపంచవ్యాప్తంగా ఏటా కోటి మందిని క్యాన్సర్ మహమ్మారి బలిగొంటుండగా.. పురుషుల్లోనూ రొమ్ము క్యాన్సర్ వేగంగా విస్తరిస్తోంది. రొమ్ము క్యాన్సర్ కేవలం మహిళలకే వస్తుందన్న అపోహ వల్ల పురుషులు లక్షణాలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా 87 శాతం కేసులు చివరి దశలో బయటపడుతున్నాయని సనత్‌నగర్ ఈఎస్ఐసీ అధ్యయనం వెల్లడించింది. ప్రారంభ దశలో గుర్తిస్తే నయం చేయగలిగే ఈ వ్యాధిని అవగాహన లోపం వల్ల ప్రాణాంతకంగా మార్చుకుంటున్నారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.ప్రపంచాన్ని శరవేగంగా కబళిస్తున్న వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా దాదాపు కోటి మందికిపైగా ప్రాణాలు కోల్పోతున్నారు. మన దేశంలోనూ లక్షల సంఖ్యలో కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. ఒకసారి క్యాన్సర్ బారిన పడితే బయటపడడం చాలా కష్టం. చికిత్స తీసుకుంటూనే మరెన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక రొమ్ము క్యాన్సర్ అనగానే కేవలం మహిళలకు మాత్రమే వచ్చే వ్యాధిగా సమాజంలో ఒక బలమైన ముద్ర ఉంది. కానీ, పురుషుల్లో కూడా ఈ వ్యాధి ప్రబలుతోందని, అది కూడా ప్రాణాంతకమైన చివరి దశలో బయటపడుతోందని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ 2019 నుంచి 2025 మధ్య కాలంలో నిర్వహించిన ఒక ప్రత్యేక అధ్యయనంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి.ఈఎస్ఐసీ అధ్యయనంలో పాల్గొన్న 15 మంది రోగుల డేటాను విశ్లేషించగా.. అందులో 60 శాతం మంది థర్డ్ స్టేజ్‌లో, 26.7 శాతం మంది ఫోర్త్ స్టేజ్‌లో ఉన్నప్పుడు మొదటిసారి డాక్టర్‌ను సంప్రదించారు. అంటే సుమారు 87 శాతం మందిలో క్యాన్సర్ శరీరం అంతటా వ్యాపించిన తర్వాతే చికిత్స ప్రారంభమైంది. లక్షణాలు కనిపించినప్పటి నుంచి వ్యాధి నిర్ధారణ అయ్యే వరకు సగటున ఆరు నెలల జాప్యం జరుగుతోందని డాక్టర్లు గుర్తించారు. అధ్యయనంలో పాల్గొన్న రోగులలో చాలా మందికి చనుమొన వెనుక గడ్డలు, చర్మం మె?ద్దుబారటం, చనుమొన లోపలికి కుంచించుకుపోవడం వంటి లక్షణాలు కనిపించాయి. ఇద్దరు రోగులలోనైతే వ్యాధి తీవ్రత పెరిగి పుండ్లు కూడా పడ్డాయి. ఇటువంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దని డాక్టర్లు సూచిస్తున్నారు.ఈఎస్ఐసీ ఆంకాలజీ విభాగం హెడ్ డాక్టర్ గుమ్మల్ విశేష్ మాట్లాడుతూ.. ఆయా రోగుల్లో ఎవరికీ ఫ్యామిలీలో క్యాన్సర్ హిస్టరీ, హార్మోన్ల సమస్యలు వంటి ముందస్తు ముప్పు కారకాలు లేవని చెప్పారు. పురుషుల్లో ఈ వ్యాధి అరుదు కావడంతో.. ప్రారంభ లక్షణాలను తప్పుగా అర్థం చేసుకోవడమే ఈ జాప్యానికి కారణమని అంటున్నారు. ఇక 2025లో జరిగిన ఫాలోఅప్ ప్రకారం.. 60 శాతం మంది రోగులు ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారు. ఇద్దరు వ్యాధి తీవ్రతతో మరణించగా.. 26.7 శాతం మంది చికిత్స ఆపేశారు. ఈఎస్ఐసీలో ఉచిత చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ.. సుదూర ప్రయాణాలు, సామాజిక వివక్ష, అవగాహన లోపం వల్ల రోగులు చికిత్సకు దూరమవుతున్నారని డాక్టర్లు చెబుతున్నారు.మహిళల రొమ్ము క్యాన్సర్‌పై ఉన్నంత అవగాహన పురుషుల విషయంలో లేకపోవడం పెద్ద లోపంగా మారిందని అంటున్నారు. పురుషుల కోసం ప్రత్యేకంగా క్యాన్సర్ మార్గదర్శకాలు లేవని వైద్య నిపుణులు చెబుతున్నారు. పబ్లిక్ హెల్త్ మెసేజింగ్‌లో పురుషుల రొమ్ము క్యాన్సర్‌ను కూడా చేర్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల క్యాన్సర్‌ను నోటిఫైబుల్ డిసీజ్‌గా గుర్తించడం వల్ల డేటా సేకరణ మెరుగుపడుతుందని అయితే జాతీయ స్థాయిలో దీనిపై ప్రత్యేక విధానాలు రావాలని నిపుణులు కోరుతున్నారు

## జగిత్యాలలో గురుశిష్యుల మధ్య పోరు

**కరీంనగర్ :** కాంగ్రెస్ సీనియర్ నేత.. నాలుగు దశాబ్దాలుగా ఆ పార్టీలో కొనసాగిన కురవృద్ధుడు.. శేష జీవితం ప్రశావంతంగా గడుపుతానని ప్రతీ ఎన్నికల్లో ఇవే నాకు చివరి ఎన్నికలు అంటూ ప్రకటిస్తూ.. ఓటమి చవి చూస్తున్న జీవన్‌రెడ్డి.. ఇటీవలే హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పారు. బీఆర్ఎస్ నుంచి జగిత్యాల ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడం జీవన్‌రెడ్డి జీర్ణించుకోలేదు. పార్టీ మార్పిడి నిర్ణయం జగిత్యాల జిల్లా రాజకీయాల్లో భూకంపాన్ని సృష్టించింది. 1990 నుంచి జిల్లాలో ఆయన ప్రభావం ఎమ్మెల్యే టికెట్ల నుంచి మంత్రి పదవుల వరకు విస్తరించింది. ఈ చర్యతో స్నేహితులు విడిపోతూ, ప్రత్యర్థులు బలపడుతున్నారు. ఆయన మార్గదర్శకత్వంలో ఎన్నికల్లో విజయవంతమైన అనేక మంది ఇప్పుడు కొత్త మార్గాలు వెతుకుతున్నారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు తాజా రాజకీయ పరిణామాలు సంక్లిష్టంగా మారాయి. జీవన్ రెడ్డిని గురువుగా గౌరవించి, 2018 ఎన్నికల్లో ఆయన సపోర్ట్‌తో విజయం సాధించిన లక్ష్మణ్‌కుమార్ ఇప్పుడు పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు గురువుపై విమర్శలు చేయాల్సి వచ్చింది. గురువు మార్గదర్శనాన్ని వదులుకుని పార్టీకి లాయల్టీ చూపితే, స్థానిక ప్రజల సపోర్ట్‌లో లోటు పడవచ్చు. లేకపోతే, పార్టీలో స్థానం కోల్పోయే ప్రమాదం. ఈ సంక్లిష్ట పరిస్థితి అడ్లూరి రాజకీయ కెరీర్‌ను మలుపు తిప్పుతోంది.జీవన్‌రెడ్డి చర్య జగిత్యాలలో అధికార పద్ధతులను కుదిపిస్తోంది. బీఆర్ఎస్ ఈ విభేదాలను ఉపయోగించుకుని, స్థానిక అసంతృప్తి వర్గాలను తనవైపు మళ్లించుకుంటోంది. బీజేపీ కూడా కొత్త మైదానాలు తెరుస్తోంది. గత ఎన్నికల్లో జీవన్ ప్రభావంతో కాంగ్రెస్ బలపడినా కొన్ని మండలాలు ఇప్పుడు అనిశ్చితంలో ఉన్నాయి. వీటిని తనవైపు తిప్పుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో రాయికల్ మున్సిపాలిటీలో బీజేపీ పట్టు సాధించడమే ఇందుకు నిదర్శనం.గురు?శిష్యుల మధ్య ఈ ఉద్రిక్తత ఓ పూర్తి రాజకీయ యుద్ధానికి దారితీస్తుందా అనేది కీలక ప్రశ్న. జీవన్ రెడ్డి కొత్త పార్టీలో బలపడి, స్వతంత్ర అభ్యర్థులను ప్రోత్సహిస్తే, అడ్లూరి వర్గాలు విడిపోతాయి. అయితే, రహస్య సమావేశాల ద్వారా సమాధానం కనుక్కుంటే, జిల్లా రాజకీయాలపై అడ్లూరి పట్టు సాధించే అవకాశం ఉంటుంది. మంత్రిగా కూడా ఉన్న నేపథ్యంలో ఆయన నిర్ణయాలు ఇప్పుడు పార్టీకి దిశానిర్దేశం కానున్నాయి.

# సంపాదకీయం

## డీలిమిటేషన్‌తో దేశ ఐక్యతకు భంగం!

కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ అనుసరిస్తున్న పలు విధానాల వలన దేశ ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య దూరం రోజురోజుకూ పెరిగిపోతున్నది. ప్రధానంగా వస్తువులపై పన్ను సేకరణ మొత్తాలను ఒకే గొడుగుకిందికి తీసుకొచ్చిన జీఎస్టీ విధానం 101 రాజ్యాంగ సవరణ ద్వారా 2016 సంవత్సరం నుండి అమలులోకి వచ్చినది. ఇప్పటికే ఈ పన్ను సేకరణ మొత్తాలను వివిధ రాష్ట్రాలకు చేస్తున్న పంపిణీలో వ్యత్యాసాలు ఉన్నాయి.. దీంతో దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన అసంతృప్తికి గురి అవుతున్నాయి. మరోవైపు నియోజకవర్గాల డీలిమిటేషన్ పునర్విభజనను 2011 జనాభా ప్రాతిపదికగా చేయడంతో పుండు మీద కారం చల్లినట్టు దేశ ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అగాథం ఏర్పడ డానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు అయింది. రాజ్యాంగంలోని 82 (170) ఆర్టికల్ చట్టం ద్వారా దేశంలో నియోజకవర్గాల డీలిమిటేషన్ ప్రక్రియ మొదటిసారి 1951 జనాభా గణాంకాల ఆధారంగా చేపట్టారు.. 1952లో 489 లోకసభ స్థానాలను ప్రకటించారు. రెండోసారి 1963లో 489 నుండి 522కు పెంచుతూ విభజన జరిగింది. ఇక మూడవ పర్యాయం 1973లో 522 నుండి 545 పార్లమెంటు సభ్యుల స్థానాలుగా పెరిగాయి. అధిక జనాభా కలిగిన రాష్ట్రాలు అధిక ప్రయోజనం పొందనున్నాయని, అలా పొందకుండా నిరోధించడానికి చట్ట సవరణ ద్వారా డీలిమి టేషన్ ప్రక్రియను నిలిపివేశారు.. తిరిగి 1986 ఆర్టికల్ 84 సవరణ ద్వారా నియోజకవర్గాల డీలిమిటేషన్ పునర్విభజన ప్రక్రియను 2026 వరకు వాయిదా వేశారు. కాబట్టి ఈ సంవత్సరం జనాభాను అనుసరించి నియోజకవర్గాల డీలి మిటేషన్ జరగబోతున్నది. ఈ నేపథ్యంలో దేశ ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య జనాభా ఉత్పత్తి వృద్ధి రేటులో గణనీయంగా హెచ్చు తగ్గులు చోటు చేసుకున్నాయి. ఈ కారణంగా ఏ క్షణంలోనైనా అసంతృప్తి భగ్గున మండడానికి సిద్ధంగా వుంది. 2026లో వివిధ రాష్ట్రాల జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే అగ్నికి ఆజ్యం పోసినట్టు అవుతుంది. ఈ వెలుగులో ప్రధాన కార్యకారణాలను పరిశీలించాల్సి ఉంది. అందులో ప్రధానమైనది రాష్ట్రాల మధ్య సంతాన ఉత్పత్తి వృద్ధి నిష్పత్తి క్రమాన్ని అవగతం చేసుకోవాలి. అక్షరాస్యత ఉన్నత చదువులు, కుటుంబ సంక్షేమం అభివృద్ధి తద్వారా సమాజ వృద్ధి పెంపొందడం వలన దక్ష ణాదిలో జనాభా తగ్గిపోయినది. ప్రజలు వస్తు సేవలను వినియోగించుకోవడం ద్వారా అధిక వస్తు సేవల పన్నులు చెల్లిస్తున్నారు. ఇదే కాలంలో అటు ఉత్తర భారత రాష్ట్రాలలో నిర క్షరాస్యత, వెనుకబాటు మూలంగా అధిక జనాభా ఉంది. జనాభా నిష్పత్తి ఆధారంగా జీఎస్టీ సంపద పంపిణీలో అధిక నిధులను దేశ ఉత్తర రాష్ట్రాలు పొందుతున్నవి. జనాభా తక్కువ ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ నిధుల పంపిణీ జరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం నిధుల పంపిణీలోనూ, నియోజకవర్గాల పునర్విభజనలోనూ వివక్ష కొనసాగడం తద్వారా రానున్న కాలంలో దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా పరిణమించనున్నది. దక్షిణాదికి చెందిన ఆయా రాష్ట్రాలలోని అధికార, విపక్ష పార్టీలన్నీ తాత్కాలిక ప్రయోజనాలను పక్కనపెట్టి ఏకం కావలసిన తరుణం ఆసన్నమైనది. ఉత్తర భారతంలో విస్తరించిన బీజేపీ, దక్షిణాదిలో ఎలాగైనే సరే.. జండా ఎగరవేయాలని తహతహలాడుతున్నది. అందులో భాగంగానే ఎన్నికల సంఘం ద్వారా రాష్ట్రాలలో "సర్" అమలు పరుస్తున్నది. దీని ద్వారా ఎన్నికల సంఘం దేశంలో ముందు ఎప్పుడూ లేనంత తీవ్ర విమర్శలను వివిధ రాజకీయ పార్టీల నుంచి ఎదుర్కొంటున్నది. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాల పిల్లి మెడలో గంట ఎవరు కడతారో..? ఎదిరి చూడవలసి ఉన్నది. ఇప్పటికే ఆయా రాష్ట్రాల లోకసభ స్థానాలు మొత్తం 850 వరకు పెరగనున్నాయని తెలుస్తున్నది. అంటే రాష్ట్రాలలో గణనీయంగా లోకసభ స్థానాలు పెరగనున్నాయి. దక్షిణాది రాష్ట్రాలలో కొద్దో గొప్పో పెరుగనున్నాయి.. ఈ పరిస్థితులను రాజకీయ పార్టీలు రానున్న ఎన్నికలలో తమ ప్రధాన అస్త్రంగా ఉపయోగించుకోవడానికి, ఇప్పటినుండే కారాలు, మిరియాలు నూరుతున్నాయి. ఒకవైపు 2011 జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన లోకసభ సమా వేశాలలో ప్రవేశ పెట్టే బిల్లును లోకసభ సభ్యులకు చేర వేశారు. మరోవైపు 2026 జనాభా ఆధారంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లు కల్పిస్తామని సదరు బిల్లులో చేర్చారు. రానున్న కాలంలో దేశంలో ఉత్తర దక్షిణాది రాష్ట్రాల మధ్య దూరం పెరగడమే కాకుండా, దేశ ఐక్యతకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉన్నది.


# నిర్లక్ష్యపు నీడలలో శాతవాహనుల తొలి రాజధాని



అవిభక్త కరీంనగర్ జిల్లాకు 50 వేల సంవత్సరాలకు పూర్వపు చరిత్ర ఉంది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు, శాతవాహనుల మొట్ట మొదటి రాజవంశం, ఆదీ మహారాష్ట్రలోని పైతానో లేక నాసిక ప్రాంతమో అనుకుంటే కాదని, అంతకు ముందే వీరు ఆంధ్రులని, కరీంనగర్ జిల్లా నే వారి మూల పురుషులకు ఆవాస స్థానమని, చారిత్రక పరిశోధనలు స్పష్టం చేశాయి. శాతవాహన వంశానికి మూలపురుషుడు అని భావింపబడే శ్రీముఖుడు కోటి లింగాలను రాజధానిగా చేసుకుని పాలించాడని స్పష్టం అయినాక, ఆయన నాణేలు కోటిలింగాలలో లభ్యమైనాక చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. జిల్లా కేంద్రమైన కరీంనగర్ కు 65 కి.మీ .ల, ధర్మపురి క్షేత్రానికి 19 కి.మీ.ల దూరాన వెల్గటూర్ మండలం లోని గోదావరి, పెద్దవాగు సంగమ స్థాన మందుగల కోటిలింగాల లోని పుట్ట కోట గోడలు (పూర్వపు కోటలు) ఆంధ్రదేశ పాలకులైన శాతవాహనుల తొలి రాజులకు ఆటపట్టయినవి. ఆంధ్రుల తొలిరాజుగా పురాణాలలో వర్ణించ బడిన శ్రీముఖ చక్రవర్తి నాణాలను , కప్పారావు పేట సమీపాన, ధర్మపురి వాస్తవ్యులు ప్రముఖ చారిత్రక పరిశోధకులు, పురావస్తు శాఖలో ఎపిగ్రాఫిక్ అసిస్టెంట్ (శాసన వ్యాఖ్యాత)గా పనిచేస్తూ మరణించిన సంగనభట్ల నరహరి శర్మ సేకరించి, పురావస్తు శాఖకు అప్పగించడంతో , ఈ ప్రాంత ప్రాశస్త్యం వెలుగు చూడగలిగింది. శాతవాహన కాలానంతర మైనట్టి వారికి ఉద్యోగ చెందిన "మహా తలవర, మహా సేనాధిపతిపతిస" అను నాణెములు ఇచ్చట లభించినవి. విదిశా నగరమును కేంద్రముగా ఏలిన చివరి శుంగ రాజుల నాణెములు లభింపగా, వాటిపై బ్రాహ్మీ లిపిలో "రజోగోబదస, రజో సమగోపస" అని వ్రాసి ఉన్నవి. శుంగుల అనంతరం మగధను ఏలారని పురాణాలలో పేర్కొనిన కాణ్వ రాజుల నాణెములు కూడా లభించాయి. వీటి ఆధారంగా పురాణములందు పేర్కొన్నట్లు, మగధ రాజ్యమును మౌర్యుల అనంతరం శృంగులు, కాణ్వులు పిదప ఆంధ్రులు వరుసగా పాలించినట్లు తార్కాణం ఇచ్చు చున్నదని పురావస్తు శాఖ మాజీ డైరక్టర్ పుచ్చా వాసుదేవ పరబ్రహ్మ శా స్త్రీ సోదాహరణంగా నిరూపించారు. వీటిలో కొన్ని కోటిలింగాల పొలములలో బ్రాహ్మీ లిపి లోని శిలా ఫలకాలు వెలుగు చూశాయి. ఇచట లభించినట్లు అపు రూప నాణెములు వేరెచ్చటా లభించని కారణంగా , కోటిలింగాల శాతవాహనుల తొలి రాజధాని అని, పరిసర ప్రాంత కేంద్ర స్థానమని స్పష్టమైంది. కోటిలింగాలలోనే నరహరిశర్మ పంచమార్క్ నాణేలు , ఇతర అపు రూప నాణేలు సేకరించి పురావస్తు శాఖకు హస గతం చేశారు. వానిలో "రజో శాతవాహ , రజో సాతకంనిస" అని బ్రాహ్మీ లిపిలో వ్రాయ బడింది. లిపి ప్రకారం శ్రీముఖుని కన్నా ఇవి ప్రాచీనమైనవి. సహజంగా ఉండవలసిన ఉజ్జయిని చిహ్నం వీటిలో లేదని నరహరి పరిశోధనలో పేర్కొన్నాడు. శాతవాహన కాలపు పొరల్లో అనేక శాతవాహన నాణేలు లభించాయి. లభ్యమైన నాణెములను బట్టి శాతవాహన వంశ మూల పురుషుడైన శాత వాహనుడు ఆంధ్ర గోపులను , శబరులను, మహా తలవరులను, తదితర ఆంధ్ర రాజులను ఓడించి శాతవాహన సామ్రాజ్యాన్ని స్థాపించాడు. శాతవాహనులు తొలుత ఆంధ్రుల పాలనలో భాగమై, ఆంధ్ర భృత్యులుగా ఉండి, బలవంతులై సామ్రాజ్య స్థాపనకు పూనుకున్నారని, శ్రీముఖుడు చివరి కాణ్వరాజును అంతమొందించి, స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పరచి, విస్తరించారని జగిత్యాలకు చెందిన ప్రముఖ చారిత్రక పరిశోధకులు, రిటైర్ రీడర్ డాక్టర్ జైశెట్టి రమణయ్య కరీంనగర్ చారిత్రక సంస్కృతి గ్రంథంలోని వివరించారు. హాల చక్రవర్తి గాథా సప్తశతి లోని గోదావరి వర్ణన ఆధారంగా, లభ్యమైనట్లు శ్రీముఖ నాణాలను బట్టి కోటిలింగాల, శాతవాహనుల బలిష్ట దుర్గమని స్పష్టం అవుతున్నది. కోటిలింగాల సమీపమున గల గుట్ట జైన మునులకావాస స్థానముగ నుండేదని తెలుస్తున్నది. సమీపాన క్రీ.పూ.రెండవ శతాబ్దపు బౌద్ధ స్తూపం పాపాయిగాం గుట్టపైన ఉండేది. ప్రస్తుతం మధ్య యుగానికి చెందిన దేవాలయం గ్రామంలో ఉంది. రెండు గర్భగృహాలకు ఉమ్మడి మంటపముంది. ప్రతి గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధానాలయంలో కోటీశ్వరుడు లింగ రూపుడుగా ప్రతిష్ఠితుడు కాగా, దక్షిణ దిశలో ఉత్తర ముఖ గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధాన ఆలయంలో కోటీశ్వరుడు లింగ రూపుడై ఉన్నాడు. ఆలయం చాళుక్య రీతులలో నుండి, గోదావరి ఒడ్డున అనేక శిల్ప ప్రతిమ లున్నాయి. పురావస్తు శాఖచే త్రవ్వకాలు జరపబడి, పర్యాటక శాఖ గుర్తింపు పొందింది ఈ ప్రదేశం. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాక్చరిత్రకు నిలువెత్తు నిలువుటద్దంగా నిలిచి, శాతవాహనుల తొలి రాజధానిగా చరిత్ర పుటలకెక్కి, జిల్లా సంతరించుకున్న జిల్లా చరిత్ర గతినే మార్చి, విశేష ప్రాధాన్యత కోటిలింగాల ఒడ్డు, గోదావరి నీటి వల్ల నానాటికీ కోతకు గురవు తున్నది. తవ్వకాలు జరిపితే చారిత్రక సత్యాలెన్నో వెలికి తీయగల చరిత్రకు పూర్వపు గ్రామం, ప్రమాదపు టంచున పయనిసున్నది. స్థానికుల, దాతల చేయూత, ధర్మకర్తల మండళ్ళ కృషితో, ప్రత్యేక నిధులను ప్రోగు చేసుకుని దేవస్థానాన్ని అభివృద్ధి పరుచుకుంది. పర్యాటక శాఖ ఈ గ్రామంపై చాలా కాలం చిన్నచూపే చూసింది. గతంలో చాలా సందర్భాలలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రముఖ పర్యాటక స్థలంగా తీర్చిదిద్ద గలమని ఇచ్చిన హామీలు, చేసిన ప్రకటన – నీటి మూటలు గానే మిగిలి పోయాయి. జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర సాయి నాయకులు, ఉన్నతాధికారులు , చారిత్రక విషయాసక్తులైన వ్యక్తులు, రాష్ట్ర చరిత్రలో ప్రధాన ప్రదేశమైన కోటిలింగాలలో ప్రత్యేక అభివృద్ధి పనులు, ప్రాచీన చారిత్రక అవశేషాల సంరక్షణా చర్యలను చేపట్టడంపై, నిర్ణయాత్మక కార్యక్రమాలను చేపట్టడంలో ఆలసత్వాన్నే ప్రదర్శించారు. ఈ కారణంగానే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాచీన చరిత్రకు సాక్షీ భూతంగా నిలిచిన కోటిలింగాల నేడు కాలగర్భంలో కలిసి పోయే ప్రమాదంలో ఉంది. శ్రీపాద పాజెక్టు నిర్మాణ చర్యలలో భాగంగా చారిత్రక గ్రామానికి వరద ముప్పు భయభ్రాంతులకు గురి చేస్తున్నది. దీనితో ఈ గ్రామ చరిత్ర పుటల నుంచి కనుమరుగు అయ్యే ప్రమాదమూ లేకపోలేదు. ఈ విషయాన్ని ఆలస్యంగా నైనా గ్రహించిన జిల్లా మేధావి వర్గం, కోటి లింగాలను పరిరక్షించే చర్యలు గైకొనాలని గత ప్రభుత్వానికి విన్నవించింది. రాష్ట్ర రాజధాని నుండి సైతం ఈ అంశంపై అవగాహన కలిగిన దివంగత ప్రభుత్వ సలహాదారు విద్యాసాగర్ రావు, మల్లేపల్లి లక్ష్మయ్య, ఆచార్య జయధీర్ తిరుమల రావు, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజిరెడ్డి, ఐకాస కన్వీనర్ కోదండరాం, తెలంగాణ జాగృతి వ్యవస్థాపకులు కవిత, కవి గాయకులు దేశపతి శ్రీనివాస్, కుర్రా జితేంద్ర బాబు లాంటి మేధావులను రప్పించి, కోటిలింగాల పరిస్థితిని ప్రత్యక్షంగా చూపించి, తద్వారా గత ప్రభుత్వం దృష్టి ఆకర్షించి, పరిరక్షించే ప్రయత్నం చేసింది. అపురూప నాణేలు లభ్యమైన కోటిలింగాల గ్రామం ఖాళీ అయితే, త్రవ్వకాలకు మరింత సానుకూలత ఉండగలదనే ప్రతిపాదన అందుకున్న రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ చెన్నారెడ్డి అందుకు సానుకూలంగా స్పందించి, కోర్ కమిటీ నిర్ణయాన్ని అనుసరించి తవ్వకాలు జరిపేలా కృషి సల్పగలమని ప్రకటించి నామ మాత్రపు తవ్వకాలు చేపట్టి చేతులెత్తేయడం జరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు ముంపుకు గురికాకుండా ఆలంపూర్ లో నిర్మించినట్లు, కోటిలింగాల పరిరక్షణ గోడలు నిర్మించాలనే ప్రతిపాదన చాలా కాలంగా కాగితాలకే పరిమిత మైంది. గతంలో నాటి సంబంధిత మంత్రి పొన్నాల లక్ష్మయ్య వద్ద ప్రతిపాదనలు ఉన్నా, పట్టించు కోలేదు. తెరాస ప్రభుత్వ సంబంధిత గత కార్యదర్శి వెంకటేశం దర్శించి, తగు చర్యలు తీసుకునేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. ఇలా ఉంటే తెరాస ప్రభుత్వంలో ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ చీఫ్ విప్ గా చేరాక, ఆయన చొరవ కృషి, కృత నిశ్చయం ఫలితంగా, పర్యాటక శోభను సంతరింప చేయాలనే తపన కారణంగా, 2018 జనవరి ఆరవ తేదీన నాటి ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ ల చేతుల మీదుగా రెండు బోట్లను ప్రారంభించారు. 50 సీట్ల కెపాసిటీతో "శాతకర్ణి", 25 సీట్లు కెపాసిటీ గల "పులోమావి" తో పాటు 4 సీటర్ల స్పీడ్ బోట్ ను ప్రారంభించారు. మంత్రిగా కొప్పుల ఈశ్వర్ హరిత హోటల్ ఏర్పాటు, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పనులు చేపట్టడానికి కృషి చేశారు. మారిన ప్రభుత్వం, ప్రస్తుత రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి, స్థానిక ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేయూతను అందించి, పర్యాటక సంబంధంగా ఎంతో చేయాల్సి ఉంది. రాష్ట్ర చరిత్రతో విడదీయ రాని సహస్రాబ్దుల సంబంధాన్ని కలిగిన అపు రూప చారిత్రక బంధాన్ని తత్సంబంధ ఆధారాలను పరిరక్షించి, గోదావరి వద్ద రక్షణ గోడ నిర్మించి, కోటిలింగాల ఉనికిని కనుమరుగు కాకుండా ఉండ గలందులకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉన్నాయి.

# ఉద్యోగుల న్యాయ పోరాటానికి విజయం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ విధానంపై దశాబ్దాలుగా నెలకొన్న అనిశ్చితికి తెర దించుతూ రాష్ట్ర హైకోర్టు వెలువరించిన తాజా తీర్పు, కేవలం ఒక పరిపాలనా పరమైన ఆదేశం మాత్రమే కాదు, అది సామాజిక న్యాయ విజయం. 2004 సెప్టెంబర్ 1వ తేదీని ప్రాతిపదికగా తీసుకుని, ఆ తేదీకి ముందే నియామక ప్రక్రియ ప్రారంభమై, కేవలం సాంకేతిక కారణాలు మరియు ప్రభుత్వ యంత్రాంగం చేసిన జాప్యం వల్ల ఆలస్యంగా విధుల్లో చేరిన వేలాది మంది ఉద్యోగుల పాలిట ఈ తీర్పు ఒక సంజీవనిలా మారింది. న్యాయస్థానం తన తీర్పు ద్వారా "లెజిటిమేట్ ఎక్స్‌పెక్టేషన్" (న్యాయ బద్ధమైన నిరీక్షణ) అనే మౌలిక న్యాయ సూత్రాన్ని పునరుద్ధరించడమే కాకుండా, వ్యవస్థాగత లోపాలకు సామాన్య ఉద్యోగులు బలి కాకూడదని అత్యంత స్పష్టంగా ప్రకటించింది. ఈ వివాదం యొక్క మూలాలు 2004లో దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన పెన్షన్ సంస్కరణల్లో నిక్షిప్తమై ఉన్నాయి. బ్రిటిష్ కాలం నాటి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) స్థానంలో కేంద్రం ప్రవేశపెట్టిన 'కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్' (సీపీఎస్) ఉద్యోగుల భవిష్యత్తును మార్కెట్ ఒడిదుడుకులపై ఆధారపడేలా చేసింది. ఓపీఎస్ కింద ఉద్యోగికి తన చివరి వేతనంలో సగం మొత్తం పెన్షన్‌గా, కరువు భత్యంతో కలిపి లభించి, పదవీ విరమణానంతరం గౌరవ ప్రదమైన జీవనానికి హామీ లభించేది. కానీ సీపీఎస్‌లో అటు ప్రభుత్వం, ఇటు ఉద్యోగి వాటాలను స్టాక్ మార్కెట్లలో పెట్టుబడిగా పెట్టడం వల్ల తిరిగి వచ్చే పెన్షన్ మొత్తంపై ఎలాంటి భరోసా లేకుండా పోయింది. ఈ అనిశ్చితి ఉద్యోగ వర్గాల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది; ముఖ్యంగా 2004 సెప్టెంబర్ 1 కటాఫ్ తేదీ కంటే ముందే నోటిఫికేషన్లు వెలు వడి, నియామక ఉత్తర్వులు ఆలస్యమైన అభ్యర్థుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ప్రస్తుత కేసులో న్యాయశాఖకు చెందిన 65 మంది ఉద్యోగులు చేసిన నిరంతర పోరాటం యావత్ రాష్ట్ర ఉద్యోగ లోకానికి దిక్సూచిగా నిలిచింది. మహబూబ్‌నగర్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పాటు సీబీఐ కోర్టుల్లో పనిచేస్తున్న వీరంతా 2004 సెప్టెంబర్ లోపు వెలువడిన నోటిఫికేషన్ల ద్వారా ఎంపికైనప్పటికీ, పరిపాలనాపరమైన జాప్యం వల్ల సీపీఎస్ పరిధిలోకి నెట్టబడ్డారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ సామ్‌కోషి, జస్టిస్ నందికొండ నర్సింగ్ రావులతో కూడిన ధర్మాసనం "ప్రభుత్వ యంత్రాంగం చేసిన ఆలస్యం వల్ల ఉద్యోగుల హక్కులను కాలరాయడం రాజ్యాంగ విరుద్ధం" అని తేల్చి చెప్పింది. ఒక అభ్యర్థి ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న సమయానికి అమల్లో ఉన్న సేవా నిబంధనలే అతనికి వర్తిస్తాయని, నిబంధనలు మార్చి వెనుకటి తేదీ నుండి అమలు చేయడం న్యాయసమ్మ తం కాదని ధర్మాసనం పేర్కొంది. ఈ తీర్పు ప్రభావం కేవలం ఆ 65 మందికే పరిమితం కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌లు, విద్యాశాఖ మరియు ఇతర ప్రభుత్వ విభాగాల్లోని సుమారు 13,000 మంది ఉద్యోగులకు ఊరట నివ్వనుంది. గణాంకపరంగా చూస్తే ఇది ప్రభుత్వంపై దీర్ఘకాలిక పెన్షన్ భారాన్ని పెంచవచ్చు కానీ, ఉద్యోగి తన జీవిత కాలమంతా సేవ చేసినందుకు ప్రతిఫలంగా వృద్ధాప్య భరోసా కల్పించడం సంక్షేమ రాజ్య ప్రాథమిక బాధ్యత అని సామాజిక వేత్తలు బలంగా వాదిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం 2023 మార్చిలో ఒక కీలక నిర్ణయం తీసుకుంది. 2003 డిసెంబర్ 22కు ముందు వెలువడిన నోటిఫికేషన్ల ద్వారా ఎంపికైన ఉద్యోగులకు ఒకేసారి అవకాశం ఇస్తూ పాత పెన్షన్ విధానంలోకి మారేందుకు అనుమతించింది. భారత ప్రభుత్వం జారీ చేసిన మెమో నంబర్ 57/04/2019 మరియు మెమో నంబర్ 57/05/2021లు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇప్పుడు రాష్ట్ర హైకోర్టు తీర్పు కూడా కేంద్ర విధానాలకు అనుగుణంగా ఉండటం గమనార్హం. రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఇప్పటికే రాజకీయ నిర్ణయాల ద్వారా ఓపీఎస్‌ను పునరుద్ధరించగా, తెలుగు రాష్ట్రాల్లో ఈ న్యాయ పోరాటం ఒక కీలక మలుపుగా మారింది. న్యాయస్థానం ఈ తీర్పు అమలుపై కఠిన వైఖరిని అవలంబిస్తూ, జూన్ 10వ తేదీలోగా అమలు చేయాలని, లేనిపక్షంలో న్యాయశాఖ కార్యదర్శి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి స్వయంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించడం అధికారుల అలసత్వానికి చరమగీతం పాడేలా ఉంది. ఆర్థిక కోణంలో చూస్తే, సీపీఎస్ వల్ల ప్రభుత్వం తక్షణమే 10 శాతం వాటా చెల్లించాల్సి ఉంటుంది, కానీ ఓపీఎస్‌లో రిటైర్మెంట్ వరకు ప్రత్యక్ష భారం ఉండదు. ఆర్టికల్ 14 ప్రకారం సమానత్వపు హక్కును కాపాడిన ఈ తీర్పు, ప్రభుత్వ జాప్యం వల్ల ఉద్యోగుల మధ్య వివక్ష చూపకూడదని నిరూపించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మెమోలను సానుకూలంగా పరిగణించి, మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా 2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన దాదాపు 9,000 మంది ఉపాధ్యాయులు దశాబ్ద కాలంగా సీపీఎస్ విష వలయంలో చిక్కుకుని సామాజిక భద్రతకు దూరమయ్యారు. ప్రభుత్వం తన మేనిఫెస్టో హామీలను నిలబెట్టుకుంటూ, హైకోర్టు తీర్పును గౌరవిస్తూ వీరిని తక్షణమే పాత పెన్షన్ పరిధిలోకి తీసుకురావాలని ఉపాధ్యాయ సంఘాలు గళమెత్తుతున్నాయి. ఈ తీర్పు ఉద్యోగులలో వ్యవస్థ పట్ల నమ్మకాన్ని పెంచడమే కాకుండా, పరిపాలనలో పారదర్శకత మరియు సమయ పాలన యొక్క ఆవశ్యకతను గుర్తు చేసింది. న్యాయస్థానం చూపిన చొరవ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ యొక్క ప్రా ముఖ్యతను చాటిచెప్పింది. ప్రభుత్వం పంతాలకు పోకుండా, ఆర్థిక పరిమితులను సాకులుగా చూపకుండా, గడువులోగా ఈ తీర్పును అమలు చేసి వేలాది కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించాలి. అప్పుడే పరిపాలనలో మానవీయత, న్యాయబద్ధత ప్రతిబింబిస్తాయి. రాబోయే రోజుల్లో ఈ తీర్పు అన్ని శాఖల ఉద్యోగులకు వర్తింప జేయడం ద్వారా ప్రభుత్వం ఒక ఆదర్శవంతమైన మరియు చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవాలని ఆశిద్దాం.



# ఎర్రఅరటి పండ్లు ఎప్పుడైనా తిన్నారా?

శరీరానికి తక్షణ శక్తిని ఇవ్వడమే కాకుండా, తీపి తినాలనే కోరికను తగ్గించడంలో కూడా అరటిపండు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇప్పటివరకు మనం పసుపు రంగు అరటిపండ్లు లేదా పచ్చి అరటిపండ్లు తిని ఉంటాం. కానీ ఎర్ర అరటిపండ్లు ఎప్పుడైనా తిన్నారా? అరటిపండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. శరీరానికి తక్షణ శక్తిని ఇవ్వడమే కాకుండా, తీపి తినాలనే కోరికను తగ్గించడంలో కూడా అరటిపండు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇప్పటివరకు మనం పసుపు రంగు అరటిపండ్లు లేదా పచ్చి అరటిపండ్లు తిని ఉంటాం. కానీ ఎర్ర అరటిపండ్లు ఎప్పుడైనా తిన్నారా? ఇవి కూడా ఎక్కువ పోషకమైనవని నిపుణులు చెబుతున్నారు. ఎర్ర అరటిపండ్లను ప్రధానంగా ఆస్ట్రేలియా, వెస్ట్ ఇండీస్, మెక్సికో, యునైటెడ్ స్టేట్స్ దేశాల్లో పండిస్తారు. అయితే ఇప్పుడు వీటి సాగు భారతదేశంలో కూడా ప్రారంభమైంది. దీంతో క్రమంగా అన్ని మార్కెట్లలోకి అందుబాటులోకి వస్తున్నాయి. ఎర్ర అరటిపండ్లలో కెరోటినాయిడ్లు, విటమిన్ సి, ఆంథోసయనిన్‌ల వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ మూలకాలు శరీరంలోని కణాల నష్టం నుండి కాపాడి, ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఎర్ర అరటిపండ్లలో విటమిన్ ఎ, కెరోటినాయిడ్లు అధికంగా ఉండటం వల్ల అవి కంటి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల దృష్టి మెరుగుపడుతుంది. ఈ అరటిపండ్లలో మెగ్నీషియం, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. దీనివల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. ఇది జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తుంది. మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఇది పేగులలో వాపును తగ్గించడం ద్వారా జీర్ణ వ్యవస్థను బలపరుస్తుంది. ఎర్ర అరటిపండ్లు శరీర రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వీటిలో ఉండే విటమిన్ సి, బీటా-కెరోటిన్ శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుండి కాపాడతాయి.

## ఈ సంకేతాలను నిర్లక్ష్యం చేయకండి!



రక్తపోటు అకస్మాత్తుగా 200 దాటితే అది ప్రాణాంతకమైన 'హైపర్‌టెన్సివ్ క్రైసిస్' కావచ్చు. ఈ స్థితిలో గుండె, మెదడు, మూత్రపిండాలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. సాధారణంగా రక్తపోటు 120/80 ఎఎఊణ ఉంటే దానిని ఆరోగ్యకరమైన స్థాయిగా పరిగణిస్తారు. కానీ ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, ఒత్తిడి కారణంగా చాలా మందిలో బీపీ స్థాయిలు అదుపు తప్పుతున్నాయి. ఒకవేళ మీ రక్తపోటు అకస్మాత్తుగా 200 దాటితే, వైద్య పరిభాషలో దీనిని 'హైపర్‌టెన్సివ్ క్రైసిస్' అని పిలుస్తారు. ఇది అత్యంత ప్రమాదకరమైన స్థితి. ఈ సమయంలో శరీరంలోని కీలక అవయవాలైన గుండె, మెదడు, మూత్రపిండాలకు తక్షణమే నష్టం జరిగే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మెదడు గుండెపై తీవ్ర ప్రభావం అధిక రక్తపోటు నేరుగా మెదడులోని రక్తనాళాలపై ఒత్తిడిని పెంచుతుంది. బీపీ 200 దాటినప్పుడు మెదడులోని సున్నితమైన రక్తనాళాలు చిట్లిపోయే ప్రమాదం ఉంది, ఇది తక్షణమే పక్షవాతానికి దారితీస్తుంది. బాధితులు ఈ సమయంలో తీవ్రమైన తలనొప్పి, కళ్ళు తిరగడం, దృష్టి మసకబారడం లేదా స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలను ఎదుర్కొంటారు. అదేవిధంగా, రక్తాన్ని పంప్ చేయడానికి గుండెపై విపరీతమైన భారం పడుతుంది. ఇది గుండె కండరాలను బలహీనపరిచి, అకస్మాత్తుగా గుండెపోటు వచ్చేలా చేస్తుంది. సకాలంలో స్పందించకపోతే ఈ నష్టం శాశ్వతంగా మిగిలిపోయే అవకాశం ఉంది. అవయవాల వైఫల్యం.. అధిక రక్తపోటు కేవలం గుండె, మెదడుకే పరిమితం కాదు. ఇది మూత్రపిండాలలోని చిన్న రక్తనాళాలను దెబ్బతీస్తుంది, దీనివల్ల కిడ్నీలు ఫిల్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేసి మూత్రపిండాల వైఫల్యానికి దారితీస్తాయి. అలాగే కళ్ళలోని నరాలు దెబ్బతినడం వల్ల అకస్మాత్తుగా చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. అందుకే అధిక రక్తపోటును 'సైలెంట్ కిల్లర్' అని పిలుస్తారు. బయటకు ఎలాంటి తీవ్రమైన లక్షణాలు కనిపించకపోయినా, లోపల అవయవాలు క్షీణిస్తూ ఉండవచ్చు. ముఖ్యంగా బీపీ 200 దాటినప్పుడు శరీరం ఇచ్చే ప్రతి హెచ్చరికను గమనించడం ముఖ్యం. అత్యవసర సమయంలో ఏం చేయాలి? ఒకవేళ మీ ఇంట్లో ఎవరికైనా రక్తపోటు 200 లేదా అంతకంటే ఎక్కువ నమోదైతే, వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించాలి. సొంతంగా మందులు వేసుకోవడం లేదా ఇంటి చిట్కాలు పాటించడం వంటి పొరపాట్లు అస్సలు చేయవద్దు. బాధితుడిని ప్రశాంతంగా ఉంచడానికి ప్రయత్నించండి ఎక్కువ కదలికలు లేకుండా చూడండి. తక్షణ వైద్య సహాయం అందడం వల్ల రక్తపోటును క్రమంగా తగ్గించి అవయవాలు దెబ్బతినకుండా కాపాడవచ్చు. సాధారణ రక్త పరీక్షలు, క్రమం తప్పకుండా బీపీ చెక్ చేసుకోవడం ద్వారా ఇటువంటి అత్యవసర పరిస్థితులు రాకుండా నివారించవచ్చు.

## కొబ్బరినీరు తెగ తాగేస్తున్నారా?



దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతున్న వేళ, దాహార్తిని తీర్చుకోవడానికి ప్రతి ఒక్కరూ ప్రకృతి సిద్ధమైన పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో కొబ్బరి నీరు వేసవిలో అత్యంత ప్రాచుర్యం పొందిన సూపర్‌డ్రింక్ గా మారింది. సహజ ఎలక్ట్రోలైట్స్, శరీరానికి తక్షణ శక్తినిచ్చే గుణాలు ఉండటంతో ఫిట్‌నెస్ ప్రేమికుల నుండి సామాన్యుల వరకు అందరూ దీనిని అమృతంలా భావిస్తారు. చక్కెరతో కూడిన సాఫ్ట్ డ్రింక్స్‌కు ప్రత్యామ్నాయంగా ఇది అత్యుత్తమ ఎంపిక అనడంలో సందేహం లేదు. కొబ్బరి నీటిలో సుమారు 95 శాతం నీటితో పాటు పొటాషియం, సోడియం, మెగ్నీషియం వంటి ఎలక్ట్రోలైట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి చెమట ద్వారా కోల్పోయిన ద్రవాలను భర్తీ చేయడానికి సహాయపడతాయి. అయితే, అతిగా తాగడం వల్ల రక్తంలో పొటాషియం స్థాయిలు విపరీతంగా పెరిగి 'హైపర్‌కలేమియా' అనే పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల కండరాల బలహీనత, గుండె కొట్టుకోవడంలో వేగం తగ్గడం లేదా పెరగడం వంటి అసమానతలు తలెత్తుతాయి. తీవ్రమైన సందర్భాల్లో ఇది గుండెపోటుకు కూడా దారితీయవచ్చు. అందుకే కొబ్బరి నీటిని మితంగా తీసుకోవడం ప్రాణావసరం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (చిఊూ) ప్రకారం, సాధారణ మంచి నీరే ప్రాథమిక హైడ్రేషన్ మూలంగా ఉండాలి తప్ప, కేవలం ఎలక్ట్రోలైట్ పానీయాలపైనే ఆధారపడకూడదు. అయితే, సహజ సిద్ధమైనది కదా అని అమితంగా కొబ్బరి నీరు తాగడం వల్ల ఊహించని ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## పచ్చిఉల్లితో లెక్కలేనన్ని లాభాలు..

ఆహారంలో ఉల్లిపాయలను చేర్చుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఉల్లిపాయల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. కిచెన్‌లో ఏ వంట చేయాలన్నా ఉల్లిపాయలు తప్పక అవసరం అవుతాయి. పోపులో ఉల్లిపాయ లేకపోతే ఆ కూర రుచిగా ఉండదు. కానీ ఈ ఉల్లిపాయ ఉపయోగం కేవలం వంటల రుచిని పెంచడానికి మాత్రమే పరిమితం కాదు.. ఆహారంలో ఉల్లిపాయలను చేర్చుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఉల్లిపాయల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. కిచెన్‌లో ఏ వంట చేయాలన్నా ఉల్లిపాయలు తప్పక అవసరం అవుతాయి. పోపులో ఉల్లిపాయ లేకపోతే ఆ కూర రుచిగా ఉండదు. కానీ ఈ ఉల్లిపాయ ఉపయోగం కేవలం వంటల రుచిని పెంచడానికి మాత్రమే పరిమితం కాదు. ఎండు ఉల్లిపాయని రోజూ గ్రాము చొప్పున తీసుకుంటే ఎముకల్లో ఖనిజ సాంద్రత పెరుగుతుంది. గొంతునొప్పి ఉంటే ఉల్లిపాయలో బెల్లం కలిపి తింటే ఉపశమనం కలుగుతుంది. జీర్ణ సమస్యలు ఉన్నవాళ్లు నాలుగు టీస్పూన్ల ఉల్లిరసంలో చిటికెడు ఇంగువ, నల్లఉప్పు కలిపి రోజుకి రెండుమూడుసార్లు మూడునెలలపాటు తాగితే నులిపురుగుల బాధ ఉండదనీ చెబుతారు గృహవైద్య నిపుణులు. తెల్ల ఉల్లిపాయ ముక్కల్ని నీళ్లలో వేసి మరిగించి తాగితే మూత్రంలో మంట తగ్గడంతోపాటు మూత్రపిండాలూ ఆరోగ్యంగా ఉంటాయి. కలరా వ్యాధితో బాధపడే రోగికి ఉల్లిరసాన్ని తరచూ పట్టిస్తే మంచిదట. పచ్చి ఉల్లిపాయని తింటే నెలసరి సమస్యలూ తగ్గుతాయి. ఉల్లిపాయలో విటమిన్ సి ఉంటుంది. ఉల్లిపాయలో విటమిన్ బి6 కూడా ఉంటుంది. అందుకే ఆహారంలో ఉల్లిపాయలను తప్పక చేర్చుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఉల్లిపాయలో వివిధ రకాలు ఖనిజాలు కూడా ఉంటాయి. ఉల్లిలో యాంటీఆక్సిడెంట్లు, సల్ఫర్, పొటాషియం, ఫైబర్ కూడా అధికంగా ఉంటాయి. అందుకే ఉల్లిపాయలను ఆహారంలో చాలా ముఖ్యమైన భాగంగా పరిగణిస్తారు. మీ ఆహారంలో ఉల్లిపాయలు ఉండటం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఉల్లి రక్తపోటును అదుపులోనూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. ఉల్లిపాయలు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఉల్లిలో ఉండే విటమిన్ సి మీ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఉల్లిపాయలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా సహాయపడతాయి. కానీ ఉల్లిన ఎల్లప్పుడు ఆహారంలో మితంగానే తీసుకోవాలి.



## ఏ నూనె ఆరోగ్యానికి మంచిది?



మన వంటకాల్లో నూనె వాడకం రుచిని పెంచినప్పటికీ, అది మోతాదు మించితే ఆరోగ్యానికి ముప్పుగా మారుతుంది. ఐసీఎంఆర్ మార్గదర్శకాల ప్రకారం ఒక వ్యక్తి రోజుకు 20 మిల్లీలీటర్లకు మించి నూనె వాడకూడదు. ముఖ్యంగా మరిగించిన నూనెను పదే పదే వాడటం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రిఫైన్డ్ నూనెల కంటే గానుగ నూనెలు శ్రేయస్కరమని, విభిన్న రకాల నూనెలను మారుస్తూ వాడటం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వారు సూచిస్తున్నారు. సరైన మోతాదు, నాణ్యమైన నూనె ఎంపికే ఆరోగ్యానికి రక్షణ కవచం. మన భారతీయ వంటకాల్లో నూనె అనేది విడదీయలేని భాగం. ఉదయం టిఫిన్ నుండి రాత్రి భోజనం వరకు ప్రతి దశలోనూ నూనెను విరివిగా ఉపయోగిస్తాం. అయితే, రుచి కోసం మనం వాడుతున్న అధిక నూనె మన ప్రాణాల మీదకు తెచ్చే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మారుతున్న జీవనశైలి కారణంగా దేశంలో ఒక్కో వ్యక్తి ఏడాదికి సగటున 23.5 లీటర్ల నూనెను వాడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఐసీఎంఆర్ మార్గదర్శకాలు భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఎఅఓఖీ) ప్రకారం, ఒక ఆరోగ్యవంతుడైన వ్యక్తి రోజుకు 20 మిల్లీలీటర్లకు మించి నూనె వాడకూడదు. అంటే దాదాపు నాలుగు టేబుల్ స్పూన్లు మాత్రమే. ఒకవేళ మీ కుటుంబంలో నలుగురు సభ్యులు ఉంటే, నెలకు మీ నూనె వినియోగం గరిష్ఠంగా 4 లీటర్లకు మించకుండా చూసుకోవాలి. నూనె పూర్తిగా మానేయడం కూడా మంచిది కాదు, ఎందుకంటే విటమిన్ ఎ, డి, ఇ, కె వంటి పోషకాలను శరీరం గ్రహించాలన్నా, శారీరక శ్రమకు అవసరమైన శక్తి లభించాలన్నా సరైన మోతాదులో కొవ్వు అవసరం. కానీ, మోతాదు మించితే మాత్రం రక్తనాళాల్లో పూడికలు, ఊబకాయం, అధిక రక్తపోటు వంటి గుండె జబ్బులకు దారి తీస్తుంది. మరిగించిన నూనె మళ్లీ వాడటం ప్రాణాంతకమా? మనం చేసే అతిపెద్ద తప్పు ఏమిటంటే.. ఒకసారి డీప్ ఫ్రై చేసిన నూనెను మళ్లీ మళ్లీ వేడి చేసి వాడటం. ఇలా పదే పదే మరిగించిన నూనెలో విషపూరిత రసాయనాలు ఏర్పడతాయి. ఇది కాలేయం దెబ్బతినడానికి క్యాన్సర్ వంటి వ్యాధుల ముప్పు పెరగడానికి కారణమవుతుందని ప్రముఖ పోషకాహార నిపుణులుహెచ్చరిస్తున్నారు. నూనె రంగు మారినా, జిగురుగా తయారైనా లేదా దుర్వాసన వచ్చినా దానిని వెంటనే పారేయడం ఉత్తమం. వేడి చేసినప్పుడు పొగ వస్తున్న నూనెను వాడటం వల్ల శరీరంలో ఆక్సీకరణ ప్రక్రియ పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. రిఫైన్డ్ ఆయిల్ వర్సెస్ కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్.. ఏది మేలు? నూనె నాణ్యత విషయంలో కోల్డ్ ప్రెస్డ్ (గానుగ) నూనెలు అత్యుత్తమమని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే వీటిలో రసాయనాలు ఉండవు, సహజ సిద్ధమైన యాంటీ ఆక్సిడెంట్లు, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు అలాగే ఉంటాయి. రిఫైన్డ్ ఆయిల్ తయారీలో గింజలను అధిక వేడికి గురి చేయడం వల్ల అందులోని పోషక విలువలు తగ్గిపోతాయి.

# తేజస్విపై కోదరండరామ్ ఫైర్

హైదరాబాద్ : తెలంగాణ అస్తిత్వాన్ని, అమరుల త్యాగాలను కించపరిచేలా బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలు చేశారని తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏమాత్రం సందర్భం లేకుండా, కనీస అవగాహన లేకుండా తెలంగాణ ఏర్పాటును బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులతో ముడిపెట్టడం శోచనీయమని మండపడ్డారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ప్రకారం, అత్యున్నత ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఏర్పాటైన రాష్ట్రాన్ని కించపరచడం అంటే భారత రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు.తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను నాటి బీజేపీ అగ్రనేతలు సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ గౌరవించి, మద్దతు తెలిపిన విషయాన్ని కోదండరాం ఈ సందర్భంగా గుర్తు చేశారు. సొంత పార్టీ సీనియర్ నేతలు తీసుకున్న నిర్ణయాలను కూడా అర్థం చేసుకోకుండా తేజస్వి సూర్య మాట్లాడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ అంత బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతుంటే పక్కనే ఉన్న కేంద్ర మంత్రులు ఆయన్ని నిలువరించకపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు ఈ వ్యాఖ్యలను ఖండించకపోవడాన్ని బట్టి చూస్తే, వారికి రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని అర్థమవుతోందని విమర్శించారు. తేజస్వి వ్యాఖ్యలను తక్షణమే పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించాలని, ఆయనపై బీజేపీ అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### హరీష్ మండిపాటు

బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. తెలంగాణ ఏర్పాటును అవమానించడం బీజేపీకి అలవాటుగా మారింది. గతంలో ప్రధాని మోదీ పార్లమెంటులో తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని అంటే, ఇప్పుడు ఈ ఎంపీ అంతకంటే ఘోరంగా మాట్లాడుతున్నారు అని విమర్శించారు. వందలాది మంది బలిదానాలతో, దశాబ్దాల పోరాటంతో సిద్ధించిన తెలంగాణను బ్రిటిష్ విభజనతో పోల్చడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని, వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### పొన్నం ప్రభాకర్ కౌంటర్

రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా తేజస్వీ సూర్యపై నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చింది. పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర ఏర్పాటు జరిగింది. దీనిని అశాస్త్రీయం అనడం రాజ్యాంగాన్ని అవమానించడమే అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన మోడల్‌ను విమర్శించే ముందు, దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి కడుతున్న పన్నుల వాటాపై తేజస్వీ సూర్య



అవగాహన పెంచుకోవాలని హితవు పలికారు. తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

### రాజకీయ రంగు పులుముకున్న విభజన సెగ

మొత్తంగా తేజస్వీ సూర్య వ్యాఖ్యలు తెలంగాణలో బీజేపీకి రాజకీయంగా ఇబ్బందికరంగా మారాయి. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందన్న భయం ఒకవైపు ఉంటే, మరోవైపు తెలంగాణ ఏర్పాటునే తప్పుబట్టేలా మాట్లాడటంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఏకతాటిపైకి వచ్చి బీజేపీ తీరును ఎండగడుతుండటంతో, రానున్న రోజుల్లో ఈ వివాదం మరింత ముదిరేలా కనిపిస్తోంది.

### వెంకయ్య, కిషన్ సమాధానం చెప్పాలి

రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంట్ సాక్షిగా జరిగిన ఈ పరిణామంపై ఆయన నిప్పులు చెరిగారు. ఆనాడు విభజన బిల్లు ఆమోదం పొందినప్పుడు బీజేపీ తరపున సుష్మా స్వరాజ్, వెంకయ్య నాయుడు వంటి అగ్రనేతలు మద్దతు తెలిపిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తేజస్వి సూర్య చేసిన ఈ వివాదాస్పద వ్యాఖ్యలకు వెంకయ్య నాయుడు, కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అసలు ఆనాడు బీజేపీ నేతలు తీసుకున్న నిర్ణయం తప్పని తేజస్వి భావిస్తున్నారా? అని ప్రశ్నించారు.ఇదే క్రమంలో ప్రధాని మోదీ అనుసరిస్తున్న రాజకీయాలపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. మోదీ సర్కార్ 'నీతి లేని రాజకీయాలు' చేస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది 'పాయసంలో విషం కలిపి తాగమన్నట్లుగా' ఉందని ఎద్దేవా చేశారు. మహిళా రిజర్వేషన్లు న్యాయమైనవని, వాటిని నేరుగా అమలు చేయకుండా డీలిమిటేషన్ పేరుతో కాలయాపన చేయడం మహిళలను బ్లాక్ మెయిల్ చేయడమేనని మండిపడ్డారు. ఈ డీలిమిటేషన్ ప్రక్రియ భవిష్యత్తులో దేశాన్ని ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించే ప్రమాదం ఉందన్న ఆందోళనను కూడా ఆయన వ్యక్తం చేశారు.

### ఆత్మ గౌరవం తాకట్టు పెడతారా

పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై ఏమాత్రం గౌరవంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదలు ఈరోజు ఎంపీ తేజస్వీ సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుపై విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు.తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడలేదని అన్నారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాదిమంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు.పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కూడా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణమని అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు.తెలంగాణను కించపరిచిన తేజస్వీ సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వీ సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

# రహదారి ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

**ప్రజలు నిత్యం సైబర్, రహదారి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి : ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి**

**రహదారుల ప్రమాదాల నివారణకు అవగాహన కీలకం కలెక్టర్ అంకిత్**




భద్రాద్రి : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న రహదారుల భద్రత వారోత్సవాలలో "అర్రైవ్ అలైవ్" కార్యక్రమం కింద శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మరియు జిల్లాలో చోటుచేసుకున్న రహదారి ప్రమాదాలు, వాటి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. గుడ్ సమారిటన్ విధానం, త్వరలో అమలులోకి రానున్న పీఎం అర్హత్ పథకం గురించి కూడా వివరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించి ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు నిత్యం సైబర్ మోసాలు మరియు రహదారి ప్రమాదాలపై అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంట్లో ఉన్నప్పుడు సైబర్ మోసాలపై, బయటకు వెళ్లినప్పుడు రహదారి ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసాల్లో డబ్బులు కోల్పోతే తిరిగి సంపాదిం చుకోవచ్చుగానీ, రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతే కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. గత ఏడాది జిల్లాలో 248 మంది రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పో యారని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ ఉపయోగించకపోవడం వంటి కారణాలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. గ్రామస్థాయిలో గ్రామసభల ద్వారా రహదారి భద్రతపై తీర్మానాలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గ్రీన్ ఫీల్డ్ హైవేలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు వంటి చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా రహదారి భద్రతను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది ప్రమాదాలను తగ్గించే దిశగా కృషి చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ "రహదారి ప్రమాదాల నివారణకు అవగాహన అత్యంత ముఖ్యమైనది. 'అర్రైవ్ అ లైవ్' కార్యక్రమం ద్వారా జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ముఖ్యంగా విద్యార్థులు, యువత ముందుకు వచ్చి సమాజంలో రహదారి భద్రతపై చైతన్యం కల్పించాలి. జిల్లాలో కేటీపీఎస్, బీటీపీఎస్, సింగరేణి వంటి పరిశ్రమల కారణంగా భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో ప్రమాదాల అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే 38 బ్లాక్ స్పాట్లను గుర్తించి, అక్కడ ప్రత్యేక చర్యలు చేపడుతున్నాము. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు తక్షణ వైద్యసహాయం అందేలా అంబులెన్స్ సేవలను బలోపేతం చేస్తున్నాము. అలాగే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నాము. ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, వేగ పరిమితులు పాటించడం వంటి అంశాలను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి. రహదారి భద్రతను ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా తమ బాధ్యతగా భావించి సహకరించాలి." జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణలో పోలీస్ శాఖతో పాటు మున్సిపల్, వైద్య, రవాణా తదితర శాఖల సమన్వయం కీలకమని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి రోజు సుమారు 500 మందికి పైగా రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ వినియోగించకపోవడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలు తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించి రహదారి భద్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం రహదారి భద్రతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే కొంతమందికి డ్రైవింగ్ లైసెన్సులు అందించారు. పూసుకుంట గిరిజన కొండరెడ్డి సమాజానికి చెందిన వారికి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి, మార్కెట్ కమిటీ ఛైర్మన్, పాల్వంచ డిఎస్పి సతీష్, తాసిల్దార్ రామ్ నరేష్ ఎంపీడీవో రవీందర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు, పోలీస్ శాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎండాకాలం జాగ్రత్తలు తెలియజేయాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల :** ఎండాకాలం నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చే జాగ్రత్తలు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారుసిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్ అర్బన్ ఆరోగ్య వైద్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, వ్యాక్సిన్లు, ఓపీ రిజిస్టర్ పరిశీలించి.. సూచనలు చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్, టీకాలు, మందుల పంపిణీపై ఆరాతీశారు. పలువురు పేషెంట్లతో మాట్లాడి .. వారి అనారోగ్య సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొన్నారు. మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పరిశీలనలో వైద్యురాలు రేణుక, సిబ్బంది తదితరులు ఉన్నారు

## నేషనల్ హైవే63 వద్ద భూ సంబంధిత అంశాలపై ఫీల్డ్ విచారణ.

**ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. ఎస్ లత**



**జగిత్యాల:** జగిత్యాల రూరల్ మండలంలోని పోరండ్ల గ్రామ పరిధిలోని నేషనల్ హైవే?63 వద్ద భూ సంబంధిత అంశాలపై ఫీల్డ్ ఎంక్వైరీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)బి.ఎస్ లత మాట్లాడుతూ ప్రత్యక్షంగా స్థలాన్ని సందర్శించి, సంబంధిత భూసమస్యలు, సరిహద్దులు, రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. స్థానిక రైతులు, భూ యజమానుల నుండి అభిప్రాయాలు, ఫిర్యాదులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భూ రికార్డుల సరిదిద్దడం, అవసరమైన ధృవపత్రాల జారీ, మరియు చట్టబద్ధమైన ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు.ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను పరిష్కరించి, పారదర్శకంగా మరియు సమర్థవంతంగా సేవలు అందించడానికి చర్యలు కొనసాగుతాయని ఈ సందర్భంగా తెలిపారు.ఈ పరిశీలనలో జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకిమ్, రెవెన్యూ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## సీఎం పర్యటనకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి :** ఈనెల 20వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడిగడ్డ కాళేశ్వరం, అనంతరం కాటారం మండలం నస్తురుపల్లిలో రైతు భరోసా రెండో విడత నిధులు విడుదల కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఇట్టి కార్యక్రమాలకు పటిష్టమైన బందోబస్తు కేటాయించిన విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. నస్తూర్ పల్లి బహిరంగ సభకు విచ్చేసే ప్రజలకు మంచినీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలన్నారు. బహిరంగ సభా స్థలి వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని డీపీవోకు సూచించారు. ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. చేపట్టనున్న పనులను పర్యవేక్షణ చేయాలని సబ్ కలెక్టర్ కు సూచించారు. హెలి ప్యాడ్, అప్రోచ్ రోడ్డు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అలాగే పబ్లిక్ మీటింగ్ వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని పిఆర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్కింగ్ ప్రాంతాల్లో లైటింగ్, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అత్యవసర వైద్య కేంద్రాలు ఏర్పాటుతో పాటు అంబులెన్సులు సేఫ్ హౌస్ ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కాళేశ్వర దేవాలయాన్ని విద్యుద్దీకరణ చేయాలని ఈఓను ఆదేశించారు. ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు వారి కేటాయించిన విధులపై ధ్రువీకరణ నివేదిక అందజేయాలని తెలిపారు. సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెల 19, 20 తేదీలలో ఇసుక లారీలకు అనుమతి ఇవ్వొద్దని, మూసివేయాలని ఆయన తెలిపారు. విధులు నిర్వహించు సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని కలెక్టరేట్ ఏవో కు సూచించారు. అంతకుముందు కాలేశ్వరం నస్తూరి పల్లిలో సీఎం పర్యటన హెలిప్యాడ్ పనులను పరిశీలించారు.ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీవో హరికృష్ణ కాటారం డిఎస్పి సూర్యనారాయణ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన

**మండలంలోనిర్మాణం అవుతున్న పలు భవనాల పరిశీలన**

**జగిత్యాల /బుగ్గారం :** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రం తో పాటు యశ్వంతరావు పేట గ్రామంలో శుక్రవారం రోజున జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. యశ్వంతరావుపేటలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. అనంతరం బుగ్గారంలోనిఎదుల బోర్లలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం,మూడు గ్రామల సమైక్య భవనాల నిర్మాణం, తహసిల్దార్ మండల పరిషత్ కార్యాలయాల భవనాల నిర్మాణ పనులను, నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. ఆయా కాంట్రాక్టర్ లతో, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో, సంబంధిత శాఖల అధికారులతో ఆయన మాట్లాడాతూ నిర్మాణ పనులు త్వరగా, నాణ్యతగా పూర్తి చేయాలని ఆదేశించారు. బిల్లుల చెల్లింపులు కూడా త్వరలోనే అవుతాయని, పనులు ఆలస్యం కాకూడదని తెలిపారు.డీఆర్డీఏ పిడి రఘువరన్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ గౌడ్, మండల తహసీల్దార్ భూమేశ్వర్, ఇంచార్జ్ ఎంపిడివో అనుమల్ల వాసవి, ఎపిఎం రమాదేవి,వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, బుగ్గారం సర్పంచ్ నక్క రాజవ్వ, కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు నగునూరి నర్సా గౌడ్ తదితరులు ఉన్నారు.

## బిజినెస్

### విప్రో భారీ బైబ్యాక్ ధమాకా

ప్రముఖ ఐటి దిగ్గజం విప్రో తన వాటాదారులకు తీపి కబురు అందించింది. కంపెనీ చరిత్ర లోనే అత్యంత భారీ స్థాయిలో రూ.15,000 కోట్లతో షేర్ల బైబ్యాక్ (తిరిగి కొనుగోలు) చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఒక్కో షేరును రూ.250 చొప్పున కొనుగోలు చేయాలని కంపెనీ నిర్ణయించింది. గురువారం మార్కెట్ ముగిసే సమయానికి ఉన్న షేరు ధర రూ.210తో పోలిస్తే, ఇది దాదాపు 19 శాతం అధికం కావడం విశేషం. మొత్తం 60 కోట్ల షేర్లను టెండర్ రూట్ ద్వారా కొనుగోలు చేయనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన నివేదికలో విప్రో వెల్లడించింది. ఇది కంపెనీ మొత్తం పెయిడ్ అప్ షేర్ క్యాపిటల్‌లో 5.7 శాతానికి సమానం. ఇందుకు సంబంధించిన రికార్డు తేదీని త్వరలోనే ప్రకటించనుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2025-26 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో విప్రో నికర లాభాలు 2 శాతం తగ్గి రూ.3,502 కోట్లుగా చోటు చేసుకున్నాయి. కంపెనీ ఆదాయం మాత్రం 8 శాతం పెరిగి రూ.24,236 కోట్లుగా నమోదయ్యింది. డిసెంబర్ త్రైమాసికంతో పోల్చినప్పుడు లాభంలో 12 శాతం పెరుగుదల కనిపించడం కొంత ఊరటనిచ్చే అంశం.

### అగాధంలోకి ఆభరణాల ఎగుమతులు



భారత రత్నాలు, ఆభరణాల రంగం ఊహించని సంక్షోభంలో చిక్కుకుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2025-26లో ఈ రంగం ఎగుమతులు ఐదేండ్ల కనిష్ట స్థాయికి పడిపోయాయని రత్నాలు, ఆభరణాల ఎగుమతి ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) వెల్లడించింది. ముఖ్యంగా మన దేశానికి ప్రధాన కొనుగోలుదారు అయిన అమెరికా విధించిన భారీ సుంకాలు ఈ పతనానికి ప్రధాన కారణమయ్యాయని తెలిపింది. 2025-26లో మొత్తం ఎగుమతులు 27.72 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఇంతక్రితం ఏడాదిలోని 28.7 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇది 3.3 శాతం తగ్గుదల. కరోనా లాక్‌డౌన్‌ల సమయంలో వాణిజ్యం పూర్తిగా నిలిచిపోయిన 2020-21 కాలం తర్వాత ఎగుమతులు ఇంత కనిష్ట స్థాయికి చేరడం ఇదే మొదటిసారి. అమెరికాకు జరిగే ఎగుమతులు దాదాపు సగానికి పడిపోవడమే. అమెరికా విధించిన కొత్త సుంకాలు, దిగుమతి పన్నుల కారణంగా భారతీయ ఆభరణాలకు గిరాకీ తగ్గింది. గ్లోబల్ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు లక్షలాది మంది కళాకారులు, వ్యాపారులపై ఆధారపడి నడుస్తున్న ఈ పరిశ్రమ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

# ఇరాన్ యుద్ధంతో రెస్టారెంట్లకు రూ. 79,000 కోట్ల నష్టం



పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా కమర్షియల్ ఎల్‌పీజీ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. దీనివల్ల దేశంలోని రెస్టారెంట్ రంగం తీవ్రమైన ఇంధన కొరతను ఎదుర్కొంటోంది. పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పీహెచ్‌డీసీసీఐ) తాజా నివేదిక ప్రకారం, గ్యాస్ కొరత కారణంగా దేశంలోని రెస్టారెంట్ పరిశ్రమ నెలకు సుమారు రూ. 79,000 కోట్ల ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటోంది. రోజువారీ కార్యకలాపాలకు ఎల్‌పీజీపై అధికంగా ఆధారపడే ఈ రంగానికి ఇది పెద్ద దెబ్బ. పరిశ్రమ అంచనాల ప్రకారం, మనదేశంలో ఆహార సేవల మార్కెట్ వేగంగా పెరుగుతోంది. 2024లో ఈ రంగం విలువ రూ. 5.69 లక్షల కోట్లుగా ఉండగా, 2028 నాటికి రూ. 7.76 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా. 2026 నాటికి ఇది సుమారు రూ. 6.46 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉంది. దీని ప్రకారం, ఈ రంగం రోజుకు సుమారు రూ. 17,700 కోట్ల వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. ప్రస్తుత ఇంధన సమస్య కారణంగా రెస్టారెంట్ పరిశ్రమ 15-20 శాతం క్షీణించిందని నివేదిక చెబుతోంది. దీంతో రోజుకు రూ. 2,650 కోట్లకు పైగా నష్టపోతోంది. అంటే నెలకు రూ. 79 వేల కోట్లకు పైనే. ఇప్పటికే ఈ సంక్షోభ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. భారత రెస్టారెంట్ అసోసియేషన్ ప్రకారం, దాదాపు 10 శాతం రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడ్డాయి. మరో 60-70 శాతం సంస్థలు పరిమిత సామర్థ్యంతో మాత్రమే పనిచేస్తున్నాయి. అనేక రెస్టారెంట్లు ప్రస్తుతం ఇండక్షన్ స్టవ్, ప్రత్యామ్నాయ ఇంధనం, తగ్గించిన మెనూ, తక్కువ పని గంటలతో కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సాగర్ దర్యాణి పేర్కొన్నారు.

# టీసీఎస్ ఘటనతో అలర్ట్ అయిన ఐటీ కంపెనీలు




ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్ నాసిక్ కార్యాలయంలో లైంగిక వేధింపుల ఆరోపణలు ఐటీ పరిశ్రమను కుదిపేస్తున్నాయి. ఈ ఘటన తర్వాత వేధింపులు, పని సంస్కృతిపై పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగులు తమ అనుభవాలను పంచుకుంటూ అనేక ఆరోపణలు చేస్తున్నారు. ఐటీ సేవల సంస్థ టెక్ మహీంద్రా, తమ కంపెనీ ఆఫీస్ ప్యాంట్రీని 'ఫుట్‌వేర్-ఫ్రీ జోన్'గా ప్రకటించిందని ఎక్స్‌లో ఓ పోస్ట్ వైరల్ అయింది. ఆ పోస్టులో కంపెనీ ఆఫీస్ ప్యాంట్రీని 'ఫుట్‌వేర్-ఫ్రీ జోన్'గా ప్రకటించడం మతపరమైన పక్షపాతానికి ఉదాహరణ అని ఆరోపించారు. అయితే, దీన్ని కంపెనీ ఖండించింది. ఆ ఫోటో తమ ఆఫీస్‌కి సంబంధించింది కాదని, సోషల్ మీడియాలో వచ్చిన సమాచారం అవాస్తవమని కంపెనీ స్పష్టం చేసింది. తమ సంస్థలో మతంతో పాటు ఎలాంటి వివక్షకు చోటు లేదని, ప్రతి ఉద్యోగిని గౌరవంగా, సమానంగా చూసే వాతావరణం ఉందని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. మరో సందర్భంలో ఇన్ఫోసిస్ కూడా వేధింపులు, వివక్ష పట్ల కంపెనీలో జీరో టోలరెన్స్ విధానాన్ని పాటిస్తున్నామని ప్రకటించింది. అయినప్పటికీ, కొన్ని సంస్థల్లో ఉద్యోగులు వేధింపుల గురించి ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. ఇలాంటి ఘటనలు పూర్తిగా తగ్గాలంటే ఫిర్యాదుల వ్యవస్థలను బలోపేతం చేయాలని హెచ్ఆర్ నిపుణులు సూచిస్తున్నారు. కంపెనీల్లో రూల్స్ ఉన్నా, ఉద్యోగులు ఫిర్యాదు చేయడానికి భయపడుతున్నారు. ప్రతీకార చర్యలు, న్యాయం జరగదేమోననే సందేహాలు వారిని వెంటాడుతున్నాయి. ఫిర్యాదులపై విచారణలో పారదర్శకత ఉండాలని, ఉద్యోగులు భయపడకుండా ముందుకు వచ్చేందుకు అనుకూల వాతావరణం కల్పించాలని పేర్కొంటున్నారు.

# పాండ్యాలో ఆ లక్షణాలు లేవు.. హిట్‌మ్యాన్‌కే మళ్లీ కెప్టెన్సీ ఇవ్వాలి..!



ప్రతి సీజన్‌లో పంజా విసిరే ముంబై ఇండియన్స్ గత రెండు సీజన్లుగా తేలిపోతోంది. పంతొమ్మిదో ఎడిషన్‌ను విజయంతో ఆరంభించినా వరసగా మూడు ఓటములతో ముంబై వెనకబడింది. సొంత మైదానమైన వాంఖడేలోనూ ముంబై పాచిక పారలేదు. లీగ్ దశలో తడబాటులో ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిల్లుతున్న వేళ కెప్టెన్సీ మార్పు అనివార్యమని మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ అంటున్నాడు. ఐదుసార్లు ఛాంపియన్ మళ్లీ మునపటి జోరందుకోవాలంటే రోహిత్ శర్మకు తిరిగి సారథ్యం అప్పగించాలని తివారీ అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ చరిత్రలో ముంబై ఇండియన్స్ హవానే వేరు. ఏకంగా ఐదుసార్లు టైటిల్ విజేతగా నిలిచిన ముంబై ఈమధ్య కాలంలో తడబడుతోంది. టీ20 సారథిగా మెప్పించిన హార్దిక్ పాండ్యా సారథ్యంలో ఆ జట్టు పేలవమైన ఆటతో నిరాశపరుస్తోంది. పంతొమ్మిదో సీజన్‌లో ఈ మేటి జట్టు ఒకేఒక విజయంతో ప్లే ఆఫ్స్ రేసులో ఆమడ దూరంలో ఉంది. వాంఖడేలో పంజాబ్ కింగ్స్ చేతిలో 7 వికెట్ల తేడాతో హార్దిక్ పాండ్యా బృందం ఓటమిని అభిమానులే కాదు ఫ్రాంచైజీ జీర్ణించుకోలేకపోతోంది. ఈ నేపథ్యంలో కెప్టెన్సీ మార్పుతోనే ముంబై మళ్లీ విజయాల తోవ తొక్కుతుందని మనోజ్ తివారీ అంటున్నాడు. క్రిక్‌బజ్‌తో మాట్లాడిన తివారీ.. మళ్లీ రోహిత్‌ను కెప్టెన్ చేయాలని సూచించాడు. 'యాజమాన్యం ఎక్కడి నుంచి వస్తుంది? ప్రతి ఒక్కరు తమను తాము ఆత్మపరిశీలన చేసుకోవాలి. మీరు ఎలా ఆడుతున్నారు? అనేది గమనించాలి. ఈ ఒక్క ఏడాది మీరు బాగా ఆడడం లేదంటే ఈ తప్పు ఈసారి జరిగిందని కాదు. మీ మూలాలను కూడా తెలుసుకోవాల్సి ఉంటుంది. 2015 నుంచి 2023 వరకూ రోహిత్ సారథ్యంలో ముంబై ఐదుసార్లు ట్రోఫీని ఒడిసిపట్టింది. ఒక కెప్టెన్సీ విషయానికొస్తే.. శ్రేయస్ అయ్యర్ అద్భుతం. అదే ముంబై నాయకుడు మాత్రం వ్యూహాలు పన్నడంలో చాలా బలహీనంగా కనిపిస్తున్నాడు. ఈ సమస్యకు పరిష్కారం ఏంటంటే పాండ్యాను కెప్టెన్సీ నుంచి తప్పించాలి. మళ్లీ రోహిత్‌కే ముంబై పగ్గాలు అప్పగించాలి. ముంబై యాజమాన్యం రోహిత్‌ను సారథిగా తప్పించి అతడికి అన్యాయం చేసింది' అని మనోజ్ తివారీ పేర్కొన్నాడు. అయితే.. 19వ సీజన్‌లో ముంబై వైఫల్యానికి బాధ్యత పాండ్యా ఒక్కడే కాదని జట్టు మొత్తం తీసుకుంటుందని హెడ్‌కోచ్ మహేల జయవర్ధనే అన్నాడు. దాంతో, పాండ్యాను ఇప్పటికిప్పుడు సారథిగా తప్పించడం లేదనే సంకేతాల్ని ఇచ్చాడు జయవర్ధనే.


### బాంబు పేల్చిన' పాక్ కెప్టెన్.. సంచలన నిర్ణయం!



భారత్ ఈ మెగా టోర్నీకి ఆతిథ్యం ఇవ్వగా.. తటస్థ వేదికైన శ్రీలంకలో పాక్ తమ మ్యాచ్‌లు ఆడిన సంగతి తెలిసిందే. భారత్, అమెరికా, నెదర్లాండ్స్, నమీబియాలతో కలిసి గ్రూప్-ఎ నుంచి పోటీపడిన పాక్.. టీమిండియా చేతిలో చిత్తుగా ఓడింది. అయితే, పసికూనలపై ప్రతాపం చూపి సూపర్-8 వరకు చేరుకోగలిగింది. కానీ ఈ దశను దాటలేక ఇంటిబాట పట్టింది. ఈ టోర్నీలో సల్మాన్ ఆఘా ఆరు ఇన్నింగ్స్ ఆడి కేవలం 60 పరుగులే చేశాడు. ప్రస్తుతం పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో కరాచీ కింగ్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న ఆఘా వైఫల్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు ఆరు మ్యాచ్‌లలో కలిపి ఆఘా కేవలం 84 పరుగులే చేశాడు. ఈ నేపథ్యంలో అతడు సంచలన నిర్ణయం తీసుకున్నాడు. పొట్టి ఫార్మాట్‌కు సుదీర్ఘ విరామం ఇవ్వనున్నట్లు తెలిపాడు. ఈ మేరకు.. "నా ఫామ్ గురించి చర్చ నడుస్తోంది. వరల్డ్‌కప్ టోర్నీలో నా ప్రదర్శన బాగాలేదు. పాకిస్తాన్ లీగ్‌లోనూ ఇదే కొనసాగుతోంది. ఇది ఆందోళన కలిగించే అంశం. ఇక వన్డే వరల్డ్‌కప్-2027 కూడా ఎంతో దూరంలో లేదు. ప్రస్తుతం నేను ఈ టోర్నీ మీదే దృష్టి సారించాలని భావిస్తున్నాను. ఈ ఏడాది డిసెంబరు దాకా టీ20 మ్యాచ్‌లు కూడా లేవు. అందుకే పీఎస్ఎల్ ముగిసిన తర్వాత వన్డే, టెస్టు ఫార్మాట్ల మీదే ఎక్కువగా దృష్టి సారిస్తాను. వన్డే ప్రపంచకప్ సన్నాహకాల కోసం టీ20లకు దూరంగా ఉండమన్నా ఉంటాను. నా దృష్టి ఇప్పుడు వన్డే, టెస్టుల మీదే ఉంది" అని సల్మాన్ ఆఘా చెప్పుకొచ్చాడు. కాగా టీ20 ప్రపంచకప్ వైఫల్యం తర్వాత పాకిస్తాన్ వన్డే సిరీస్ ఆడేందుకు బంగ్లాదేశ్‌కు వెళ్లింది. ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో సల్మాన్ ఆఘా మెరుగ్గా రాణించాడు. మొత్తంగా 175 పరుగులు సాధించాడు. ఇదిలా ఉంటే.. సల్మాన్ ఆఘా ఇప్పటి వరకు పాకిస్తాన్ తరఫున కేవలం 916 పరుగులే చేశాడు. స్ట్రైక్‌రేటు 123.11 కావడం గమనార్హం. ఇక యాభై వన్డేల్లో కలిపి 1538 రన్స్ రాబట్టిన ఆఘా.. 23 టెస్టులాడి 1487 పరుగులు సాధించాడు.


## స్పోర్ట్స్

### వైభవ్ సేఫ్.. రోమి భిందర్‌కు బీసీసీఐ షాక్!




రాజస్తాన్ రాయల్స్ జట్టు మేనేజర్ రోమి భిందర్ డగౌట్‌లో ఫోన్ వాడడంపై బీసీసీఐ కఠిన చర్యలు తీసుకుంది. ఐపీఎల్ నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను రోమి భిందర్‌కు రూ. లక్ష జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే అతడిపై నిషేధం కూడా పడుతుందని వార్తలు వచ్చినప్పటికీ బీసీసీఐ మాత్రం రోమి భిందర్‌కు జరిమానాతో సరిపెట్టింది. ఈ విషయాన్ని బీసీసీఐ ప్రధాన కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించాడు. ఐపీఎల్‌లో జట్టు మేనేజర్‌లు మొబైల్ ఫోన్‌లు ఉపయోగించడానికి అనుమతి ఉన్నప్పటికీ మ్యాచ్ జరిగే సమయంలో ఫోన్ వాడడం నిషేధమని ఆయన తెలిపారు. అయితే డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్నప్పుడు మాత్రం జట్టు మేనేజర్లు ఫోన్ వాడేందుకు అనుమతి ఉందన్నారు. ఈ విషయంలో రోమి భిందర్‌కు షోకాస్ నోటీసు కూడా జారీ చేశామని, కానీ నోటీసుపై అతడు ఇచ్చిన వివరణపై యాంటీ కరప్షన్ యూనిట్ అసంతృప్తి వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. అయితే రోమి భిందర్‌కు మొదటి ఉల్లంఘన కాబట్టి, నిబంధనల ప్రకారం అతడికి రూ. లక్ష జరిమానాతో సరిపెడుతున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించినట్లు తెలిపారు. ఈ ఘటనను అందరూ గుణపాఠంగా తీసుకోవాలని, ఆట దెబ్బతినకుండా ప్రతీ ఒక్కరు నియమ నిబంధనలు పాటించాలని తాము విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 10న గౌహతి వేదికగా రాజస్తాన్ రాయల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడ్డాయి. రాజస్తాన్ ఇన్నింగ్స్ 11వ ఓవర్‌లో రోమి భిందర్ డగౌట్‌లో కూర్చొని మొబైల్ ఫోన్ వాడుతూ కెమెరాలకు చిక్కాడు. ఆ సమయంలో రాజస్తాన్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కూడా అతడి పక్కనే కూర్చొని ఫోన్ చూడడం వివాదానికి దారి తీసింది. అయితే ఈ చర్యతో వైభవ్ సూర్యవంశీకి సంబంధం లేకపోవడంతో, అతడిని కేవలం హెచ్చరికతోనే సరిపెట్టినట్లు బీసీసీఐ తెలిపింది. ఇక ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస విజయాలతో జోరు మీదున్న రాజస్తాన్ రాయల్స్‌కు సన్‌రైజర్స్ బ్రేకులు వేసింది. మ్యాచ్‌లో హైదరాబాద్ 57 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. రాజస్తాన్ రాయల్స్ తన తర్వాతి మ్యాచ్‌ను ఆదివారం కేకేఆర్‌తో ఆడనుంది.

# క్రేజీ కాంబోలో రాబోతున్న 'ఉడ్తా తీర్'





బాలీవుడ్ వెండితెరపై ఓ సరికొత్త కలయిక ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. విలక్షణ నటుడు ఆయుష్మాన్ ఖురానా,యంగ్ సెన్సేషన్ సారా అలీఖాన్ జంటగా నటిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'ఉడ్తా తీర్'. ఈ సినిమాకు సంబంధించిన విడుదల తేదీని మేకర్స్ తాజాగా అధికారికంగా ప్రకటించారు. సాధారణంగా గూఢచారి సినిమాలు అంటే యాక్షన్, సీరియస్ డ్రామాతో నిండి ఉంటాయి. కానీ, 'ఉడ్తా తీర్' ఆ గూఢచారి ప్రపంచాన్ని పూర్తిగా వినోదాత్మకంగా, తలకిందులు చేసేలా చూపిస్తూ ఒక స్పై యాక్షన్ కామెడీగా రాబోతోంది. ఆయుష్మాన్ ఖురానా తనదైన శైలిలో చేసే కామెడీ అడ్వెంచర్లు ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ కానున్నాయట. ప్రముఖ రచయిత ఆకాష్ ఎ కౌశిక్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నారు. విభిన్నమైన కథాంశంతో ఆయన ఈ కథను సిద్ధం చేశారని సమాచారం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించాలనే లక్ష్యంతో స్టార్ ప్రొడ్యూసర్ కరణ్ జోహార్, అదర్ పూనావాలా, గునీత్ మోంగా కపూర్ వంటి హేమాహేమీలు ఈ ప్రాజెక్ట్ కోసం చేతులు కలిపారు. వినోదానికి ప్రాధాన్యతనిస్తూనే, ఒక సాహసోపేతమైన ప్రయాణంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ పనులను శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాను సెప్టెంబర్ 11, 2026న థియేటర్లలో విడుదల కాబోతున్నట్లు మూవీ మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. ఆయుష్మాన్ మార్క్ కామెడీకి సారా అలీఖాన్ గ్లామర్ తోడైతే బాక్సాఫీస్ వద్ద వినోదాల పంట పండటం ఖాయమని మేకర్స్ భావిస్తున్నారు.



# నటసింహంతో డింపుల్ సెల్ఫీ..

## సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న ఫొటోలు

నటసింహం నందమూరి బాలకృష్ణ, యువ నటి డింపుల్ హయాతి కలిసి చేసిన సందడి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గుంటూరులో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమం కోసం వీరిద్దరూ కలిసి ప్రయాణించడమే కాకుండా, అక్కడ దిగిన ఫొటోలు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గుంటూరులోని లక్ష్మీపురంలో ఒక ప్రముఖ జ్యువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవానికి బాలకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయనతో పాటు డింపుల్ హయాతి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరిద్దరూ హైదరాబాద్ నుంచి గుంటూరుకు ఒకే ప్రత్యేక హెలికాప్టర్‌లో ప్రయాణించారు. ఈ ప్రయాణ సమయంలో డింపుల్ హయాతి తన ఫోన్‌లో సెల్ఫీ తీయగా.. పక్కనే ఉన్న బాలయ్య చిన్న పిల్లాడిలా రకరకాల క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ అల్లరి చేశారు. సాధారణంగా గంభీరంగా కనిపించే బాలయ్య, ఇంత సరదాగా ఉండటాన్ని చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం బాలయ్య గోపీచంద్ మలినేని దర్శకత్వంలో 'చీదీఖ 111' (వర్కింగ్ టైటిల్) చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో డింపుల్ హయాతి రెండో హీరోయిన్‌గా నటిస్తోందని ఇప్పటికే వార్తలు వస్తున్నాయి. తాజాగా వీరిద్దరూ కలిసి ఒకే ఈవెంట్‌లో కనిపించడంతో, ఈ రూమర్లు నిజమేనని ఫ్యాన్స్ భావిస్తున్నారు. అయితే, దీనిపై చిత్ర యూనిట్ నుండి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# 'లెనిన్' పది రోజుల్లో మొత్తం క్లోజ్

అఖిల్ అక్కినేని ప్రస్తుతం 'లెనిన్' చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. భాగ్యశ్రీ బోర్సే ఇందులో హీరోయిన్‌గా కనిపించనుండగా, మురళీ కిషోర్ అబ్బూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. జూన్ 26న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ చాలా రోజుల క్రితమే ప్రకటించారు. ఇక తాజాగా ఈ మూవీ షూటింగ్‌కు సంబంధించిన ఒక అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రానికి సంబంధించిన మరో పది రోజుల షూటింగ్ మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అందులో మూడు రోజులు టాకీ పార్ట్ కోసం, మిగతా రోజుల్లో రెండు పాటలను చిత్రీకరించబోతున్నట్లు సమాచారం. ఇక ప్రస్తుతం డబ్బింగ్ పనులు కూడా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత ప్రణాళికలను బట్టి చూస్తే, ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ మరియు పోస్ట్ ప్రొడక్షన్ పనులు మే నెలలో పూర్తయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. దాంతో ఈ మూవీ బృందం ఈ చిత్రాన్ని చెప్పిన సమయానికి కచ్చితంగా ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నాగార్జున అక్కినేని, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎస్ ఎస్ తమన్ సంగీతం అందిస్తున్నాడు.



# ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కి డబుల ట్రీట్.. ఆ రోజు కోసం ఎదురు చూపులు..




టాలీవుడ్ మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ వరుసగా భారీ ప్రాజెక్టులతో తన ఫ్యాన్స్‌కు ఫుల్ ట్రీట్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' అనే యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న తారక్, తన తదుపరి చిత్రాన్ని మాటల మాంత్రికుడు శ్రీనివాస్‌తో చేయనున్న విషయం తెలిసిందే. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన అరవింద సమేత వీర రాఘవ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింతగా పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం ఆధ్యాత్మికత, కమర్షియల్ ఎలిమెంట్స్ మేళవింపుతో కూడిన విభిన్న కథాంశంతో తెరకెక్కనుంది. ముఖ్యంగా కుమారస్వామి నేపథ్యం ఉండబోతుందని, విజువల్ వండర్‌గా మలచడానికి త్రివిక్రమ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర అంశం టైటిల్. సోషల్ మీడియాలో వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. టైటిల్‌ను బట్టి చూస్తే, ఈసారి ఎన్టీఆర్‌ను మరింత ఉగ్రరూపంలో, శక్తివంతమైన పాత్రలో చూపించే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ రెండు సినిమాలకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ రావొచ్చని ఫిలింనగర్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ఒకే రోజు త్రివిక్రమ్ ప్రాజెక్ట్ అధికారిక ప్రకటనతో పాటు, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'డ్రాగన్' నుంచి కూడా అప్డేట్ వచ్చే అవకాశం ఉందట. ఈ డబుల్ అనౌన్స్‌మెంట్స్ ఎన్టీఆర్ అభిమానులకు నిజమైన పండుగలా మారనుండడం ఖాయం. ఒకవైపు భారీ యాక్షన్ డ్రామా, మరోవైపు ఆధ్యాత్మిక బ్యాక్‌డ్రాప్‌లో విజువల్ గ్రాండియర్ ఇలా రెండు విభిన్న జానర్లలో సినిమాలు చేయడం ద్వారా తారక్ తన గ్లోబల్ ఇమేజ్‌ను మరింత బలోపేతం చేస్తున్నాడు. మొత్తంగా ఎన్టీఆర్ తన కెరీర్‌లో అత్యంత కీలక దశలో ఉన్నాడని చెప్పాలి. వరుసగా భారీ ప్రాజెక్టులు, స్టార్ డైరెక్టర్లతో కాంబినేషన్లు, విభిన్న కథలు అన్నీ కలిసి టాలీవుడ్‌లో మరో సెన్సేషన్ సృష్టించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక ఈ సినిమాలు ప్రేక్షకులను ఎలా అలరిస్తాయో చూడాలి.

# ఆ హీరోతో నటించానని ఊరంతా చెప్పాను..



తన అద్భుతమైన నటనతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్న సత్యదేవ్ తాజాగా 'రావు బహదూర్' చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల నిమిత్తం ఇటీవల మీడియాతో ఇంటరాక్ట్ అయిన ఆయన తన కెరీర్ ప్రారంభ దశలో జరిగిన ఓ ఆసక్తికర సంఘటనను గుర్తుచేసుకున్నారు. సత్యదేవ్ మాట్లాడుతూ? "నేను నటుడిగా కెరీర్ ప్రారంభించిన కొత్తలో మహేష్ బాబు హీరోగా నటించిన ఓ సినిమాలో చిన్న పాత్ర చేశాను. అది చిన్న పాత్ర అయినా కూడా మహేష్ బాబు గారి భుజం మీద చేయి వేసుకొని ఒక చిన్న డైలాగ్ కూడా చెప్పాను. అంత పెద్ద నటుడితో కలిసి నటించడం చాలా ఆనందంగా అనిపించింది. ఆ ఆనందాన్ని ఆపుకోలేక ఊరంతా తిరిగి మహేష్‌తో సినిమా చేశానని అందరికీ చెప్పుకున్నాను. ఇక సినిమా విడుదలైన తర్వాత థియేటర్‌కు వెళ్లి చూస్తే అందులో నా పాత్ర కనిపించలేదు. ఎడిటింగ్‌లో నా సన్నివేశాలను తీసేశారని తెలిసి కాస్త బాధపడ్డాను" అని సత్యదేవ్ వెల్లడించారు. ఇక ప్రస్తుతం సత్యదేవ్ నటిస్తున్న 'రావు బహదూర్' చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. వెంకటేష్ మహా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఉఓః ఎంటర్‌టైన్‌మెంట్, ం+ూ మూవీస్, శ్రీచక్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మలయాళ చిత్రాలతో గుర్తింపు సంపాదించుకున్న దీపా థామస్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తోంది. ఈ మూవీ ద్వారా ఆమె తెలుగు తెరకు పరిచయం కానుంది.

# 'తిమ్మరాజుపల్లి టీవీ' విషయంలో కిరణ్ అబ్బవరం ఎందుకు ఆ తప్పు చేసాడు

అంతా కొత్తవాళ్లతో నటుడు కిరణ్ అబ్బవరం 'తిమ్మరాజుపల్లి టీవీ' అనే సినిమాను నిర్మించిన విషయం మనందరికీ తెలిసిందే. ఇందులో సాయి తేజ హీరోగా నటించగా, వేద జలంధర్ హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రం నుంచి మేకర్స్ విడుదల చేసిన ప్రచార చిత్రాలు అన్నీ అద్భుతంగా ఉండడంతో ప్రస్తుతం ఈ మూవీపై భారీ స్థాయిలో అంచనాలు నెలకొన్నాయి. గత కొంతకాలంగా ఏదైనా సినిమాపై మంచి అంచనాలు ఏర్పడితే, ఆ మూవీకి సంబంధించిన ప్రీమియర్ షోలను చిత్ర విడుదలకు ముందు రోజు పెద్ద ఎత్తున ప్రదర్శించడం ఆనవాయితీగా మారింది. దాంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొనడంతో, ఈ మూవీకి సంబంధించిన ప్రీమియర్ షోలను కూడా ఈరోజు సాయంత్రం నుంచి పెద్ద ఎత్తున ప్రదర్శిస్తారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. కానీ ఇప్పటివరకు అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన రాకపోవడంతో, ఈ మూవీకి సంబంధించిన ప్రీమియర్ షోలు లేనట్టేనని స్పష్టమైంది. దీనిపై కొంతమంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. కిరణ్ అబ్బవరం ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్లను అద్భుతమైన రీతిలో నిర్వహించి సినిమాను జనాల వరకు తీసుకువెళ్లాడు. ఒకవేళ నిజంగానే సినిమాలో మంచి కంటెంట్ ఉండి ఉంటే, ఈ చిత్రానికి సంబంధించిన ప్రీమియర్ షోలను ప్రదర్శించాల్సిందని, దాని ద్వారా మంచి టాక్ వస్తే అదిరిపోయే రేంజ్ ఓపెనింగ్స్ వచ్చేవని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా, రేపు ఈ చిత్రానికి గనుక మంచి టాక్ వస్తే, ఈ మూవీ భారీ కలెక్షన్లను అందుకునే అవకాశాలు చాలావరకు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com